ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 121, పేజీలు - 08

ఆదివారం,నవంబర్ 1, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

హైదరాబాద్‌కు గోదావరి జలాలు

- తాగు నీటి సమస్యకు చెక్

- నగర తాగునీటి అవసరాలకు భారీ ప్రాజెక్టు
- మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల నీటి తరలింపు
- జంట నగరాలకు 17.50 టీఎంసీలు
- మూసీ పునరుజ్జీవనానికి 2.50 టీఎంసీలు
- ప్యాకేజీ-2 పనులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- భారీ పైప్‌లైన్లు, శుద్ధి కేంద్రాల నిర్మాణం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరానికి భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా ప్రభుత్వం కీలక ప్రణాళికను ముందుకు తీసుకెళ్తోంది. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నివాస ప్రాంతాలు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా గోదావరి జలాలను తరలించే భారీ ప్రాజెక్టును చేపడుతోంది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్‌కు తీసుకురావడంతో పాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నింపి, మూసీ నదికి తిరిగి జీవం పోయాలన్నది ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా ప్యాకేజీ-2కు సంబంధించి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఆధ్వర్యంలో, హైదరాబాద్ మహానగర ప్రాంత అభివృద్ధి శాఖ పరిధిలో ఈ పనులు చేపట్టనున్నారు.

20 టీఎంసీల గోదావరి జలాల తరలింపు

ఈ ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి మొత్తం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలని ప్రణాళిక రూపొందించారు. ఇందులో 17.50 టీఎంసీల నీటిని హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు. మిగిలిన 2.50 టీఎంసీలను ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నింపడంతో పాటు మూసీ నది పునరుజ్జీవనానికి కేటాయించారు. నగర జనాభా భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక తాగునీటి అవసరాలను తీర్చేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు.

పైప్‌లైన్ల నిర్మాణానికి భారీ ప్రణాళిక

ప్యాకేజీ-2లో భాగంగా పలు ప్రాంతాలను అనుసంధానిస్తూ భారీ వ్యాసార్థం కలిగిన ఎంఎస్ పైప్‌లైన్లను ఏర్పాటు చేయనున్నారు. ఘన్‌పూర్ నుంచి ఉస్మాన్‌సాగర్ వరకు 2,200 మిల్లీమీటర్ల వ్యాసంతో పైప్‌లైన్ నిర్మిస్తారు. ఘన్‌పూర్ నుంచి ముత్తంగి వరకు 2,400 మిల్లీమీటర్ల పైప్‌లైన్ వేయనున్నారు. కోకాపేట నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వెంట ఉస్మాన్‌సాగర్ వరకు 3,000 మిల్లీమీటర్ల భారీ పైప్‌లైన్ నిర్మాణం చేపడతారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్

2లో..

భారత వ్యతిరేక శక్తులన్నీ

ఏకమయ్యాయి

- దేశ విభజనకు కుట్ర చేస్తున్నాయన్న ప్రధాని

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే దిమాగీ నక్సల్స్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోదీ సూచించారు. భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమై, దేశంలో విభజనను ప్రోత్సహించాలని కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా అబద్ధాలను, వదంతులను వ్యాప్తి చేస్తూ అస్థిరతను సృష్టించే పనిలో నిమగ్నమయ్యాయని మండిపడ్డారు. ప్రజలంతా ఐక్యంగా ఉండాలని ప్రధాని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశ ఐక్యతే మనల్ని ఒక జాతిగా ముందుకు నడిపిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గంలోనే నేడు దేశం అభివృద్ధి పథంలో ముందుకు

2లో..

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై

కాంగ్రెస్ గురి

- తెరపైకి ఎమ్మెల్సీ ఆశావహుల పేర్లు!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో నవంబర్ 14తో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సందడి మొదలైంది. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని మూడు స్థానాలను భర్తీ చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే పలువురు నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవుల సందడి మొదలైంది. నవంబర్ 14తో ఖాళీ కానున్న మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన నేతలు ఇప్పుడు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశం కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. మూడు స్థానాల్లో ఒకటి ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి కేటాయించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ రేసులో దొమ్మాటి సాంబయ్య, నాగరిగారి ప్రీతమ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, చారుకొండ వెంకటేష్, కూడా తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ఓసీ కోటాలో బ్రాహ్మణ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలనే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వర్గం నుంచి హార్కర వేణుగోపాల్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా దయాసాగర్ పేరు

2లో..

రాష్ట్రంలో జంగిల్ రాజ్

నడుస్తోంది

- రాప్తాడు ఘటనే నిదర్శనమన్న జగన్

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన కిరాతక దాడి ఘటన, టీడీపీ

2లో..

ఏపీకి మరో తుఫాను ముప్పు

- సీఎం చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు
- తుపాను ప్రభావంపై ముందస్తు చర్యలు

అమరావతి (ప్రశ్న న్యూస్) అర్నబ్ తుపాను నష్టాల నుంచి రాష్ట్రాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చే పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడంతో పాటు, మరో తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రేపటికి తుపానుగా బలపడే అవకాశాలున్నాయని, నవంబర్ 2, 3, 4 తేదీల్లో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ నుంచి రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, అర్నబ్ తుపాను విధ్వంసం అనంతరం చేపడుతున్న పునరుద్ధరణ పనులపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గమనాన్ని ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్ల ద్వారా ప్రతి ఆరు గంటలకు ఓసారి అంచనా వేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు ఉన్న అవకాశాలను కూడా గుర్తించి తగిన ప్రణాళిక చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు.

మొబైల్ నెట్వర్క్‌కు అంతరాయం లేకుండా ప్రణాళిక

విద్యుత్ అంతరాయం ఏర్పడినా మొబైల్ నెట్‌వర్క్ పనిచేసేలా

2లో..

ప్రజల గొంతుకను కాపాడేందుకే

విపక్షాల పోరాటం

- ఎవ్వరినీ వదిలిపెట్టమన్న రాహుల్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్ఞానేశ్‌తో పాటు ఇతరులను జవాబుదారీతనం నుంచి తప్పించుకోనివ్వమని హెచ్చరించారు. భవిష్యత్తులో వీరంతా భారత ప్రజల ప్రతినిధుల ఎదుట జవాబు చెప్పాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దేశంపై జరుగుతున్న దాడిలో సీఈసీ కేవలం ఒక భాగస్వామి మాత్రమేనని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడేందుకు ప్రతిపక్షాలు నిరంతరం పోరాడుతున్నాయని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష కూటమి చేసిన 'ప్రజా అభిశంసన' తీర్మానం సందర్భంగా రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

2లో..

హైదరాబాద్‌లో

హైడ్రా చర్యలు

- రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద నిర్మాణాల కూల్చివేత
- చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిపిన అధికారులు
- 40 ఏళ్లుగా పన్నులు కడుతున్నామంటున్న యజమానులు
- అధికారుల చర్యలపై హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపుపై హైడ్రా అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా రామంతాపూర్‌లోని పెద్ద చెరువు పరిధిలో కూల్చివేతలు చేపట్టారు. పెద్ద చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ పరిధిలో ఉన్న భారీ షెడ్‌ను హైడ్రా అధికారులు తొలగించారు. అయితే, ఈ చర్యపై ఆస్తి యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 40 ఏళ్లుగా ఆస్తికి సంబంధించిన పన్నులు చెల్లించడంతో పాటు విద్యుత్ బిల్లులు కూడా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని వారు చెబుతున్నారు. ఇన్నేళ్ల తర్వాత తమ ఆస్తిని కూల్చివేయడం బాధాకరమని పేర్కొన్నారు. మూడు రోజులుగా అధికారులు సర్వే కోసం వస్తుండటంతో తాము హైకోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించారు. ముందుగా చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను స్పష్టంగా నిర్ధారించిన తర్వాతే చర్యలు

2లో..

యూపీలో కోటిమంది హిందువుల ఓట్లు గల్లంతు

- యోగి ఆదిత్యనాథ్ బిగ్ బాంబ్

లక్నో (ప్రశ్న న్యూస్) ఉత్తరప్రదేశ్ ఓటర్ల జాబితా నుంచి కోటి మందికి పైగా హిందూ ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై లక్నోలో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతీ బూత్ స్థాయిలో జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణపై ఓ బీజేపీ ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం, ఇదే మొదటిసారి కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పంచాయతీ ఓటర్ల జాబితాలో పేరు ఉండి శాసనసభ ఓటర్ లిస్ట్ లో లేని

2లో..

మహిళల అండాలు సేకరిస్తున్న

ముఠా అరెస్ట్

- కాలేజీ అమ్మాయిలే టార్గెట్
- డబ్బు ఆశ చూపి అండాల సేకరణ
- వెలుగులోకి సంచలన విషయాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో అక్రమ అండాల సేకరణ వ్యవహారం కలకలం రేపుతోంది. ఇప్పటికే బేగంపేట, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో తాజాగా సరూర్‌నగర్‌లోనూ ఇదే తరహా వ్యవహారం బయటపడింది. సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో అండాలను సేకరిస్తున్నారనే సమాచారంతో

2లో..

మున్సిపల్ ఎన్నికల పోరుకు సర్వం సిద్ధం

- ప్రతి పోలింగ్ కేంద్రంపై కెమెరా నిఘా!

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ పునేతా వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కెమెరాల నిఘా పరిధిలోకి తీసుకొచ్చామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశంలో పూర్తి వివరాలు

2లో..

హైదరాబాద్‌కు గోదావరి జలాలు

జలాశయాలను అనుసంధానించేందుకు మరో 2,200 మిల్లీమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. ఘన్‌పూర్‌లోని నీటి శుద్ధి కేంద్రం నుంచి ప్రధాన నిల్వ కేంద్రానికి 3,000 మిల్లీమీటర్ల పంపింగ్ పైప్‌లైన్ నిర్మించనున్నారు.

శుద్ధి కేంద్రాలు.. భారీ నిల్వ సామర్థ్యం

ప్రాజెక్టులో భాగంగా ఘన్‌పూర్‌లో 80 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ప్రధాన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఎంబీఆర్), 18 మిలియన్ లీటర్ల ముడి నీటి నిల్వ కేంద్రాన్ని నిర్మిస్తారు. వీటితో పాటు పంప్‌హౌస్, విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఉస్మాన్‌సాగర్ వద్ద రోజుకు 120 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తారు. అక్కడ 18 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన క్లీన్ వాటర్ రిజర్వాయర్, పంప్‌హౌస్ ఏర్పాటు చేస్తారు.గోల్డెన్ మైల్ వద్ద 22.50 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఎంబీఆర్ నిర్మించడంతో పాటు 800, 600, 400 మిల్లీమీటర్ల వ్యాసంతో పంపిణీ పైప్‌లైన్లు వేయనున్నారు. మరోవైపు హిమాయత్‌సాగర్ వద్ద రోజుకు 70 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే కేంద్రాన్ని నిర్మిస్తారు. ఇక్కడ 18 మిలియన్ లీటర్ల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్, పంప్‌హౌస్, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బుద్వేల్ రిజర్వాయర్‌కు 1,000 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన పైప్‌లైన్ నిర్మిస్తారు.

పదేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు

ఈ ప్రాజెక్టు పనులను హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టనున్నారు. కేవలం నిర్మాణానికే పరిమితం కాకుండా, నిర్మాణం పూర్తయిన తర్వాత పదేళ్లపాటు నిర్వహణ బాధ్యతలను కూడా కాంట్రాక్టు పరిధిలోనే ఉంచారు. తద్వారా ప్రాజెక్టు నిర్మాణంతో పాటు దీర్ఘకాలిక నిర్వహణకు సంబంధించిన బాధ్యతలను నిర్దేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నియామక తేదీ (డీఓఏ)గా 2026 జూన్ 24ను ప్రకటిస్తూ గతంలో తీసుకున్న చర్యలను ప్రభుత్వం తాజాగా ధ్రువీకరించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

తాగునీటి భద్రతకు దీర్ఘకాలిక భరోసా

మొత్తంగా గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టు హైదరాబాద్ భవిష్యత్తు తాగునీటి అవసరాలకు కీలకంగా మారనుంది. జంట నగరాలకు భారీ స్థాయిలో నీటిని అందించడంతో పాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పునరుద్ధరణ, మూసీ నది పునరుజ్జీవనానికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడేలా ప్రణాళిక రూపొందించారు. ప్యాకేజీ–2 పనులకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రాజెక్టు అమలులో మరో కీలక అడుగు పడింది.

భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమయ్యాయి

సాగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఇది భారత సామర్థ్యానికి చిహ్నం!

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన కొరత నెలకొన్నప్పటికీ, ఈ సంక్షోభాల నుంచి భార పౌరులను కాపాడుకోగలిగాం. ఇది భారతదేశ సామర్థ్యానికి నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు. "ఇటీవలి కాలంలో ప్రపంచం ఇంధన సంక్షోభంతో సతమతమవ్వడం మనం చూశాం. కొన్ని దేశాల్లో డీజిల్, పెట్రోల్ కొనుగోళ్లపై పరిమితులు కూడా విధించాల్సి వచ్చింది. భారీ జనాభా కలిగి ఉండి, స్వదేశీ పెట్రోలియం ఉత్పత్తి తక్కువగా ఉన్న భారత్‌లో అతిపెద్ద సంక్షోభం తలెత్తుందని అప్పట్లో అంచనాలు వేశారు. ఇలాంటి ఆందోళనల మధ్య, భారత వ్యతిరేక శక్తులు కూడా చురుగ్గా మారాయి. అయితే ఈ ప్రపంచ ఇంధన సంక్షోభం మన పౌరులపై ఎలాంటి ప్రభావం చూపకుండా అడ్డుకోగలగడం భారతదేశ సామర్థ్యానికి నిదర్శనం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొని ఉన్న అస్థిర పరిస్థితులను ప్రస్తావిస్తూ, భారతీయుల ఐక్యతే దేశానికి అతిపెద్ద రక్షణ కవచమని అన్నారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో పేదరిక నిర్మూలన గురించి చర్చలు జరుగుతున్నాయి. పేదరికాన్ని తొలగిస్తామని చెప్పి ఇంతకు ముందు ఓట్లు అడిగారు. కానీ దేశంలో పేదరికం ఏ స్థితిలో ఉందో మనందరికీ తెలుసు. పేదరికాన్ని తొలగిస్తామని నినాదాలు చేసిన వారేమో మరింత ధనవంతులు అయ్యారని మోదీ పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం భారత్ అపూర్వమైన శక్తితో, దృఢ సంకల్పంతో ఉందని, దేశ ప్రజల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసమే ఇందుకు కారణమని అన్నారు.

ఉక్కుమనిషికి ఘన నివాళులు

ఉక్కుమనిషి, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనకు ఘన నివాళి అర్పించారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న పటేల్ భారీ విగ్రహం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ప్రధాని పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రతకు, భారతజాతి నిర్మాణానికి పటేల్ చేసిన సేవలను కొనియాడారు. దృఢమైన, సంపన్నమైన, సమర్థవంతమైన దేశ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని తన సందేశంలో పేర్కొన్నారు. పటేల్‌కు నివాళులు అర్పించిన తర్వాత ఏక్తానగర్‌లో నర్మదా మాత విగ్రహం నుంచి రెప్లికా గార్డెన్ వరకు సాయుధ దళాల పరేడ్ అట్టహాసంగా జరిగింది. దాదాపు 10 వేల మంది పోలీస్, పారామిలటరీ దళాలు ఈ కార్యక్రమంలో కవాతు నిర్వహించాయి. వాయుసేన నిర్వహించిన అద్భుతమైన ఫ్లైపాస్ట్, భద్రతా బలగాల మోటార్ సైకిల్ విన్యాసాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు, మార్షల్ ఆర్ట్స్, అశ్వ, ఒంటె దళాల కవాతు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 4వేల 700 మంది కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాయి. అనంతరం ప్రసంగించిన ప్రధాని మోదీ, దేశం బాహ్యం నుంచి ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాలు అన్వేషిస్తున్న సమయంలో కొన్ని శక్తులు మాత్రం అబద్ధాలు, వదంతులు వ్యాప్తి చేస్తూ అస్థిరతను సృష్టించే ప్రయత్నంలో నిమగ్నమయ్యాయని మండిపడ్డారు. దేశంలో విభజన సృష్టించాలని కుట్ర చేస్తున్న దిమాగీ నక్సల్స్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌లో హైడ్రా చర్యలు

తీసుకోవాలని కోరినా ఫలితం లేకపోయిందని వాపోయారు. చట్టబద్ధమైన భూములు, ఆస్తుల విషయంలో ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా సరైన ప్రక్రియను అనుసరించిన తర్వాతే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న తమ ఆస్తులపై ఇప్పుడు కూల్చివేతలు చేపట్టడం అన్యాయమని ఆరోపించారు. అయితే, ఆస్తి పన్నులు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు మాత్రమే ఒక నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా లేదా అన్నది నిర్ణయించవని సంబంధిత భూమి హద్దులు, అధికారిక రికార్డులు, చట్టబద్ధమైన ప్రక్రియ ఆధారంగానే ఈ అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

మినీ ట్యాంక్ బండ్‌గా ఫాక్స్ సాగర్

ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని మరో చారిత్రక జలవనరైన జీడిమెట్ల ఫాక్స్ సాగర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు హైడ్రా కార్యాచరణ చేపట్టింది. సుమారు 129 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అభివృద్ధి పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు ప్రస్తుత పరిస్థితి, కాలుష్యం, ఆక్రమణలు, పునరుద్ధరణకు అవసరమైన చర్యలపై దృష్టి సారించారు. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ హయాంలో 1897లో నిర్మించిన ఫాక్స్ సాగర్ ఒకప్పుడు ఉత్తర హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు వ్యవసాయానికి ప్రధాన ఆధారంగా నిలిచింది. అయితే, కాలక్రమేణా మురుగునీరు చేరడం, ఆక్రమణలు పెరగడం వంటి సమస్యలతో చెరువు పరిస్థితి దెబ్బతిన్నట్లు హైడ్రా అధికారులు చెబుతున్నారు. సుమారు 490 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువులో దాదాపు 150 ఎకరాల మేర ఆక్రమణలు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని కమిషనర్ తెలిపారు. అధికారికంగా హద్దులను నిర్ధారించి, ఆక్రమణలను తొలగించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఫాక్స్ సాగర్‌ను పునరుద్ధరించడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. కాలుష్య జలాలతో నిండిన చెరువును తిరిగి వినియోగంలోకి తీసుకురావడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని కాపాడటం, ఆక్రమణలను తొలగించడం హైడ్రా లక్ష్యాలుగా కమిషనర్ పేర్కొన్నారు.హైదరాబాద్ నగర విస్తరణతో చెరువులు, కుంటలపై పెరుగుతున్న ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని జలవనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఏపీకి మరో తుఫాను ముప్పు

అన్ని మండల కేంద్రాల్లో డీజిల్ జనరేటర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రంలోని బీఎస్ఎన్ఎల్ 4,500 టవర్లతో పాటు ఇతర టెలికాం నెట్‌వర్క్‌లకు నిరంతర విద్యుత్ అందించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ అవకాశాలను కూడా పరిశీలించాలని చెప్పారు. అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 7 వేల మంది సిబ్బంది, 400 యంత్రాలతో విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. వీటిని వేగంగా పూర్తి చేసి అన్ని గృహాలకు విద్యుత్ సరఫరా అందించాలని సీఎం ఆదేశించారు. తుఫాను సమయంలో దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సీఎం ఆదేశించారు. కాకినాడ వద్ద ప్రొటెక్షన్ వాల్‌ను పునరుద్ధరించాలన్నారు. నరసాపురం, కాట్రేనికోన ప్రాంతాల్లో కాలువల పూడిక తొలగించాలని సూచించారు. కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో నీరు దిగువ ప్రాంతాలకు సజావుగా వెళ్లేలా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. భవిష్యత్తులో రోడ్లు, కాలువలు ముంపునకు గురికాకుండా ప్రత్యేక ఎస్ఓపీ రూపొందించాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

ప్రతి రైతుకూ పంటల బీమా భరోసా

ప్రకృతి విపత్తుల నుంచి రైతులను ఆదుకునేందుకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమాపై విస్తృత అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. వచ్చే సీజన్ నుంచి ప్రతి రైతు బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. 47 లక్షల మంది రైతులకు చేరువయ్యేందుకు యాప్‌ను వినియోగించుకోవాలని, ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం కల్పించాలని చెప్పారు. సాంకేతికతను వినియోగిస్తున్న చాంపియన్ రైతులను గుర్తించాలని సూచించారు. అర్నబ్ తుపాను వల్ల కొబ్బరి, అరటి పంటలకు జరిగిన నష్టంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. కొబ్బరి పంట దెబ్బతిన్న 1,293 హెక్టార్లకు హెక్టారుకు రూ.54 వేల చొప్పున, నేల కొరిగిన, తలలు దెబ్బతిన్న ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.1,500 చొప్పున పరిహారం అందించాలని ఆదేశించారు. సుమారు 1.95 లక్షల కొబ్బరి చెట్లు దెబ్బతిన్నట్లు అధికారులు వివరించారు. అలాగే 15 వేల హెక్టార్లలో దెబ్బతిన్న అరటి పంటకు హెక్టారుకు రూ.35 వేల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ఐటీ, ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటమనేని భాస్కర్, విద్యుత్, విపత్తుల నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు, వివిధ టెలికాం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది

కూటమి పాలనలో నెలకొన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తరగతి గదిలోనే ఒక విద్యార్థినిపై రంపంతో జరిగిన కిరాతక దాడి.. టీడీపీ కూటమి పాలనలో శాంతిభద్రతలు ఎంతగా విఫలమయ్యాయో స్పష్టం చేస్తోంది. ఒక ప్రభుత్వ పాఠశాలలోకి దుండగుడు స్వేచ్ఛగా ఎలా ప్రవేశించి, ఒక బాలికపై ఇంత దారుణంగా దాడి చేయగలిగాడు? విద్యాసంస్థల్లో కూడా పిల్లలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని జగన్ పేర్కొన్నారు. బాధితురాలిని కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడటం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి, రాజకీయ కక్ష సాధింపులు, 'రెడ్ బుక్' పాలనకే ప్రాధాన్యం ఇస్తోందని, దీనివల్లే నేరస్థులు చట్టమంటే భయం లేకుండా రెచ్చిపోతున్నారని జగన్ ఆరోపించారు. గాయపడిన విద్యార్థినులకు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలని డిమాండ్ చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, పారదర్శక విచారణ ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే సమీక్ష జరపాలని, ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని జగన్ అన్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ గురి

కూడా చర్చలో ఉంది.మరోవైపు బీసీ సామాజికవర్గం నుంచి భారీగా ఆశావహులు ఉన్నారు. పద్మశాలి వర్గానికి అవకాశం దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఈ రేసులో ఈరవత్రి అనిల్, కైలాష్ నేత, సంగిశెట్టి జగదీశ్వర్, జక్కని అనితతో పాటు మరికొందరి పేర్లు వినిపిస్తున్నాయి. యాదవ సామాజికవర్గం నుంచి చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, లింగం యాదవ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. మహిళా ప్రాతినిధ్యం కోణంలో సునీత రావు పేరు వినిపిస్తోంది. మొత్తంగా మూడు ఎమ్మెల్సీ స్థానాల భర్తీలో సామాజిక సమీకరణాలే కీలకం కానున్నాయి. పదవులు దక్కని నేతలకు ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అవకాశం కల్పించే అంశం కూడా చర్చకు వస్తోంది. అయితే చివరకు కాంగ్రెస్ అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందనేది ఉత్కంఠగా మారింది.

ప్రజల గొంతుకను కాపాడేందుకే

విపక్షాల పోరాటం

దేశంలో రాజకీయ పరిస్థితులు మారుతున్నాయ్

దేశంలోని మొత్తం ఓటర్లలో 15 శాతానికి సమానమైన 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఎస్ఐఆర్ పేరిట తొలగించారని రాహుల్ ఆరోపించారు. "అంటే ప్రతి ఏడుగురు భారతీయులలో ఒకరి పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో వీరంతా ఓటు వేసి ఉండొచ్చు. అప్పట్లో ప్రతిపక్షానికి, అధికార పక్షానికి మధ్య ఉన్న ఓట్ల తేడా కేవలం 3శాతం మాత్రమే. ఇప్పుడు ఎన్నికల సంఘమే స్వయంగా ఆ ఓటర్లలో 15శాతం మంది అసలు ఓటు వేసి ఉండకూడదని చెబుతోంది. అంటే 2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధమని, ఆ ఎన్నికల ద్వారా లోక్‌సభలోకి ప్రవేశించిన బీజేపీ సభ్యుల ప్రవేశం కూడా చట్టవిరుద్ధమేనని ఈసీ పరోక్షంగా అంగీకరిస్తోంది" అని రాహుల్ పేర్కొన్నారు.

జ్ఞానేశ్ ఎక్కువ కాలం సీఈసీగా కొనసాగలేరు : రాహుల్

ఎస్ఐఆర్‌లో అక్రమాలకు సంబంధించి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల వద్ద తగినన్ని ఆధారాలు ఉన్నాయని రాహుల్ చెప్పారు. జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా ఎక్కువ కాలం కొనసాగలేరని అన్నారు. జ్ఞానేశ్‌కు వ్యతిరేకంగా తాము సేకరించిన ఆధారాలను బయటపెట్టిన తర్వాత కూడా బీజేపీ ఆయనను ఆ పదవిలో ఉంచాలని పట్టుపడితే అప్పుడు ఆ పార్టీ అసలు ఉద్దేశ్యం ఏమిటో స్పష్టమవుతుందన్నారు. దిల్లీలో నిర్వహించిన 'మాక్ పార్లమెంట్' సమావేశాన్ని కేవలం ఎంపీలు, పౌరుల సమావేశంగా మాత్రమే కాకుండా ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడంలో భాగస్వాములైన వారందరికీ వ్యతిరేకంగా ప్రయోగించే ఒక రాజకీయ ఆయుధంగా చూడాలని రాహుల్ పిలుపునిచ్చారు. దేశంలో ఎన్నికల వ్యవస్థను దెబ్బతీసిన వారిలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఉన్నారని ఆరోపించారు.

"ఓట్ చోరీలో భాగస్వాములైన వారు ఎప్పటికీ ఆ సంస్థ (ఎన్నికల సంఘం) వెనుక దాక్కోలేరు. ఏదో ఒక రోజు మీరు భారత ప్రజల ప్రతినిధులను తప్పక ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మోదీ, షాలు టాప్‌లో ఉన్నారు. వారి సంగతి మేం చూసుకుంటాం. కానీ మీరు వారికి సాధనాలుగా పనిచేస్తున్నారు. కాబట్టి మీరే మా మొదటి టార్గెట్. రేపు దిల్లీ వీధుల్లో ఒక రాజకీయ అస్త్రాన్ని ప్రయోగిస్తాం. ప్రతిపక్షాలు ఐక్యంగా దేశ ప్రజల మనోభావాలు ఎలా ఉన్నాయో స్పష్టంగా చూపిస్తాయి" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

ర్యాలీకి ఏర్పాట్లు పూర్తి

మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా రామ్‌లీలా మైదానంలో ఆదివారం జరగనున్న ఇండియా కూటమి మెగా ర్యాలీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిపక్ష నాయకులు, ఆయా పార్టీల మద్దతుదారులు దిల్లీకి చేరుకుంటున్నారు. కాగా, రామ్‌లీలా మైదానంలోని ప్రధాన వేదికపై భారీ త్రివర్ణ పతాకాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఇండియా కూటమిలోని పార్టీల ప్రతినిధులు కూర్చోవడానికి స్టేజ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మింటో రోడ్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు మార్చ్ (భారీ పాదయాత్ర) చేపట్టాలని, ఆ తర్వాత రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సంస్థలను ఏకతాటిపైకి తెచ్చే ర్యాలీని చేపట్టాలని విపక్షాలు నిర్ణయించాయి.

యూపీలో కోటిమంది హిందువుల ఓట్లు గల్లంతు

వారి సంఖ్య సుమారు 66 లక్షలుగా ఉందని వెల్లడించారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా ఉన్న దాదాపు 55 లక్షల మంది పేర్లు కూడా అసెంబ్లీ ఓటర్ల జాబితాలో కనిపించట్లేదని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు.అంతేకాకుండా 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల దాదాపు 4.5 లక్షల మంది ఓటర్ల పేర్లు ఇంకా నమోదు కాకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. వీటిని తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ప్రతి బూత్ స్థాయిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని బీజేపీ కార్యకర్తలను ఆదేశించారు. బూత్ లెవల్ ఆఫీసర్లను సమన్వయం చేసుకుంటూ అర్హత ఉండి ఓటరు కార్డు లేని వారిని గుర్తించి వెంటనే దరఖాస్తులు చేయించాలని సూచించారు.

ఈ విషయంలో కార్యకర్తలు మాత్రమే కాకుండా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర పదాధికారులందరూ క్రియాశీలకంగా వ్యవహరించాలని, తమ పరిధిలో ఓటర్ల జాబితాను పర్యవేక్షించాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు లేని వారు, నూతన ఓటర్లు కూడా ఈ విషయంలో పునరాలోచన చేయాలని, వెంటనే తమ పేర్లను నమోదు చేయించుకోవాలని యోగి ఆదిత్యనాథ్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో స్వయంగా తనిఖీ చేసుకోవాలని చెప్పారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ఏ ఒక్కరు కూడా తన హక్కును కోల్పోకూడదని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. బూత్ స్థాయిలో కార్యకర్తలు నిరంతరం క్రియాశీలకంగా ఉంటూ అర్హులైన పౌరులకు తమవంతు సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలోని లోపాలను సరిదిద్దడం ద్వారా రాబోయే ఎన్నికల నాటికి సమగ్ర జాబితాను సిద్ధం చేయవచ్చని ఆయన గుర్తు చేశారు. గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు ప్రతి నియోజకవర్గంలోనూ దీనిపై ప్రచారం సైతం నిర్వహించాలని పార్టీ శ్రేణులకు యోగి ఆదిత్యనాథ్ సూచించారు.

మహిళల అండాలు సేకరిస్తున్న

ముఠా అరెస్ట్

పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్కడ ఉన్న 18 మంది యువతులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నకాలేజీ విద్యార్థినులు, నిరుపేద యువతులను లక్ష్యంగా చేసుకుని ఈ వ్యవహారం సాగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ఆధారంగా సరూర్‌నగర్ పోలీసులు సదరు నివాసంలో తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక విచారణలో యువతులకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తామని ఆశ చూపి అండాల సేకరణకు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఇందుకోసం ఇంజెక్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ప్రక్రియలో ఎలాంటి వైద్య విధానాలు అనుసరించారు? అండాల సేకరణకు అవసరమైన వైద్య పరీక్షలు, సమ్మతి, ఇతర చట్టపరమైన నిబంధనలు పాటించారా ? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.సేకరించిన అండాలను నగరంలోని కొన్ని ఐవీఎఫ్ కేంద్రాలకు అనధికారికంగా సరఫరా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత కేంద్రాలకు ఈ వ్యవహారంతో ఏమైనా సంబంధాలున్నాయా ? అండాల సేకరణ, నిల్వ, రవాణా ప్రక్రియలో ఎవరి పాత్ర ఉంది ? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అయితే, ఏయే కేంద్రాలు ఈ వ్యవహారంలో భాగస్వాములయ్యాయనే విషయం ఇంకా అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని బేగంపేట, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లోనూ ఇటీవల అక్రమ అండాల సేకరణకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఇతర రాష్ట్రాల నుంచి యువతులను నగరానికి తీసుకొచ్చి వసతి కల్పించే పేరుతో వారిని ఈ వ్యవహారంలోకి దింపుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన యువతులు లక్ష్యంగా మారుతున్నట్లు గుర్తించారు.సాధారణంగా ఐవీఎఫ్ చికిత్సలో భాగంగా అండాల సేకరణకు వైద్యపరమైన పరీక్షలు, హార్మోన్ చికిత్స, వైద్య పర్యవేక్షణ అవసరం. ఈ ప్రక్రియలో మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలు పాటించడం అత్యంత కీలకం. భారతదేశంలో సహాయక పునరుత్పత్తి సాంకేతికత, సరోగసీకి సంబంధించిన చట్టాలు, నియంత్రణ వ్యవస్థలు అండాల దాతల హక్కులు, సమ్మతి, వైద్య భద్రతకు ప్రాధాన్యం ఇస్తాయి. డబ్బు ఆశ చూపి మహిళలను ఒత్తిడికి గురిచేయడం, సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా అండాలను సేకరించటం చట్టవిరుద్ధం. ఈ నేపథ్యంలో సరూర్‌నగర్ ఘటనలో యువతుల వాంగ్మూలాలు, వైద్య రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, అండాల సరఫరాకు సంబంధించిన ఆధారాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని యువతులను దోపిడీకి గురిచేస్తున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

మున్సిపల్ ఎన్నికల పోరుకు

సర్వం సిద్ధం

అందించారు.

36 వేల మంది పోలీసులతో పటిష్ఠ భద్రత

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా స్థానిక ఎన్నికల కోసం 36,351 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్‌గా వర్గీకరించారు. హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో 1+4 (ఒక అధికారి, నలుగురు సిబ్బంది), సెన్సిటివ్ కేంద్రాల్లో 1o3 పద్ధతిలో భద్రత కల్పిస్తున్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు, భద్రత కోసం 1,543 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించేందుకు డీఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను అందుబాటులో ఉంచారు. పల్నాడు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఏపీ స్పెషల్ పోలీస్‌కు చెందిన 130 ప్లటూన్లను మోహరించారు. డీజీపీ కార్యాలయం నుంచి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, క్విక్ రియాక్షన్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయని పునేఠా వివరించారు.

సుప్రీం ఆదేశాలతో సంపూర్ణ నిఘా

ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇప్పటికే 6,600 పోలింగ్ లొకేషన్లలో 12,000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5,500 సమస్యాత్మక (సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్) కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కెమెరాలు లేని చోట్ల వీడియోగ్రఫీ, అది కూడా సాధ్యం కాని మారుమూల ప్రాంతాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట జరిగే ప్రతి కదలికను రికార్డు చేస్తామని అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాలు చివరి నిమిషంలో వచ్చినా, సాధ్యమైనంత వరకు అన్ని కేంద్రాలను నిఘా పరిధిలోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని పునేఠా పేర్కొన్నారు.

బరిలో 9,642 మంది అభ్యర్థులు.. 75 వేల సిబ్బంది

రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 70 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కార్పొరేషన్ మేయర్/చైర్‌పర్సన్ పదవులకు 153 మంది, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు 367 మంది పోటీలో ఉన్నారు. కార్పొరేషన్లలోని 922 వార్డులకు 3,773 మంది, మున్సిపాలిటీల్లోని 2,382 వార్డులకు 6,669 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం మీద వార్డు పదవుల కోసం 9,642 మంది పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు.

పోలింగ్ సిబ్బంది ఇప్పటికే డిస్పాచ్ కేంద్రాల నుంచి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం వివరాలను మీడియాకు వెల్లడిస్తామని ఎస్ఈసీ తెలిపింది.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచాల్సిన అవసరం ఉందని ఎస్ఈసీ అనిల్ పునేఠా అభిప్రాయపడ్డారు. ఓటర్లలో చైతన్యం పెంచేందుకు మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీలు (పిడుగురాళ్ల, గుడిజాల, దాచేపల్లి, దార్సి, పలమనేరు, ప్రొద్దుటూరు, రాయచోటి, కమలాపురం) ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎక్కువ కాలం అమల్లో ఉంటే అభివృద్ధి పనులు కుంటుపడతాయని, అందుకే ఈ ప్రక్రియను త్వరగా ముగించడం అందరికీ శ్రేయస్కరమని పునేఠా పేర్కొన్నారు.

తండ్రి, కొడుకు బైక్ పై వెళ్తుండగా ఢీకొట్టిన కారు

- వర్ధన్నపేట జాతీయ రహదారిపై ప్రమాదం

వరంగల్ వర్ధన్నపేట జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్పై వెళ్తున్న గూగులోతు సురేష్, అతని కుమారుడు అభిరామ్ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాద దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ప్రమాదంలో సురేష్ తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. కుమారుడు అభిరామ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఇందిరాగాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

రఘునాథపల్లి, : మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా రఘునాథపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె మహేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డిలు ముఖ్య అతిధులు హాజరై స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ సమగ్రత, సమైక్యత కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆమె చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాసంపల్లి లింగజీ, మేకల నరేందర్, మార్కెట్ డైరెక్టర్ ఎండి బాష్మియా, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కోళ్ల రవి గౌడ్, మండల ఉపాధ్యక్షులు కావటి భాస్కర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మడికంటి మధు, నారగోని కుమార్, రైతు కిసాన్ అధ్యక్షులు చెంచు రమేష్, ఓబీసీ సెల్ అధ్యక్షులు వడ్లకొండ శివప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షులు జీడికంటి రాజకుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ మహేందర్ నాయక్, మండల నాయకులు మినుముల వెంకటరెడ్డి, ఇబ్రహీం పాషా, గ్రామ పార్టీ అధ్యక్షులు కడారి మహేందర్, జక్కుల కుమార్, గ్రామ సర్పంచులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో తప్పని డోలీ మోతలు

అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిపుత్రులకు డోలీ మోతలు తప్పడం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో వేల కిలోమీటర్ల రోడ్లు వేశామని నేతలు చెప్పుకుంటున్నారు. రోడ్లు వేస్తే డోలీలో మాకు మోతలు ఎందుకని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా అనంతగిరి మండలం తలారుపాడుకు చెందిన 9 నెలల గర్భిణీ నీలిమ డోలీలో కుటుంబ సభ్యులు తీసుకువచ్చి ఆస్పత్రిలో చేర్చారు. అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో రోడ్డు సదుపాయం లేక గర్భిణీతో డోలీలో తీసుకువచ్చారు. కనీస రోడ్డు సదుపాయం కల్పించలేకపోయని గిరిజనులు మండిపడుతున్నారు.

సర్దార్ పటేల్‌కు ఎంపి అరవింద్ నివాళులు

నిజామాబాద్ నిజామాబాద్ నగరంలోని వర్ని చౌరస్తా లో ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతి మరియు రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా ఎంపి ధర్మపురి అరవింద్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా , పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి , బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి , జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి , కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ పటేల్ చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని ఎంపి కొనియాడారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

సిరిసిల్ల, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆయన దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. పటేల్ ఆలోచనలు, ఆశయాలు, స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, ముఖ్యంగా యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.ప్రతి ఒక్కరూ భారతీయులమనే భావనతో ఐకమత్యంగా ఉండాలని, జాతి ఐక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయడమే సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు అర్పించే నిజమైన నివాళి అన్నారు. '1టంమ6కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, ఆర్.ఐ లు సురేష్, రమేష్ సిఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, మధుకర్, ఎస్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాల్లో జగన్ ఓ శకుని..
శిఖండిలా తెరవెనుక రాజకీయాలు

అమరావతి మరో 24 గంటల్లో పురపాలక ఎన్నికల ద్వారా వైకాపాను భూస్థాపితం చేసి, కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు విశాఖ నుంచి అనంతపురం వరకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, భాజపా జాతీయ నాయకుడు శ్రీ సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎదురయ్యే పరాజయాన్ని జీర్ణించుకోలేక జగన్ రాజకీయాల్లో శకుని పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. సొంత సోదరి కుమార్తె వివాహానికి ఆమె ఇంటినే ఇచ్చేందుకు కూడా అంగీకరించని వ్యక్తి, రాజకీయాల్లో మాత్రం శకునిలా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సొంత ప్రసార మాధ్యమాల ద్వారా వాస్తవాలను వక్రీకరిస్తూ వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేయడం జగన్ రాజకీయ సంస్కృతికి నిదర్శనమని దుయ్యబట్టారు.ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేక వ్యక్తుల పేర్లతో తప్పుడు ప్రచారాలు చేయించడం, ఆడియోలోని సారాంశాన్ని వక్రీకరించి రాజకీయ గందరగోళం సృష్టించడం జగన్‌కు అలవాటుగా మారిందని మంత్రి విమర్శించారు. ధర్మవరంలో రెండేళ్ల కిందట కలవల రాము స్థల వివాదంలో న్యాయం చేయాలని కోరుతూ మాట్లాడిన అంశాలను వక్రీకరించి, తాను బెదిరించినట్లు ఇప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. వాస్తవాలను వక్రీకరించి రాజకీయాలకు ముడిపెట్టడం ద్వారా తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు.

కలం పట్టిన ప్రతి ఒక్కరూ పాత్రికేయులేనా?!

- **అక్రిడిటేషన్ కార్డు అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు**
- **జర్నలిజం ముసుగులో బెదిరింపులు, వసూళ్ల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి**
- **నిజమైన పాత్రికేయుల హక్కులు, వృత్తి గౌరవ పరిరక్షణకు ఉద్యమిస్తాం:**
- **అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్**

జయశంకర్ భూపాలపల్లి, జర్నలిజం అంటే కేవలం గుర్తింపు కార్డు కాదు.. అది బాధ్యత. హోదా కాదు.. ప్రజల పట్ల నిబద్ధత. కెమెరా పట్టుకోవడం కాదు.. వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడం. కలం చేతబట్టడం కాదు.. సత్యం, ధర్మం, న్యాయం కోసం నిర్భయంగా నిలబడటం. అయితే కొందరి వ్యవహారశైలి కారణంగా పవిత్రమైన పాత్రికేయ వృత్తి ప్రతిష్ఠ ప్రశ్నార్థకంగా మారుతోందని అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర నాయకత్వం ఆందోళన వ్యక్తం చేసింది.జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విలేకరులమంటూ పరిచయం చేసుకుంటున్న కొందరి వ్యవహారాలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఫోర్స్ నాయకులు డిమాండ్ చేశారు.అక్రిడిటేషన్ కార్డు ఉంటేనే జర్నలిస్టా?కొన్ని ఆన్‌లైన్, పీడీఎఫ్ పత్రికల పేర్లతో విలేకరులుగా పరిచయం చేసుకుంటూ, అక్రిడిటేషన్ కార్డుల కోసం డబ్బులు చెల్లించి గుర్తింపులు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ అనేది ప్రభుత్వ గుర్తింపు ప్రక్రియలో భాగం మాత్రమేనని, అది ఎవరికీ చట్టానికి అతీతంగా వ్యవహరించే హక్కును కల్పించదని స్పష్టం చేశారు.వార్తా సేకరణ, వాస్తవ నిర్ధారణ, ఇరు పక్షాల అభిప్రాయాల సేకరణ, భాషపై పట్టు, సామాజిక బాధ్యత, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలే పాత్రికేయ వృత్తికి పునాదులని తెలిపారు. కేవలం గుర్తింపు కార్డు ఉన్నంత మాత్రాన వృత్తిపరమైన నిబద్ధత ఉన్నట్లు కాదని పేర్కొన్నారు.విలేకరి హోదాతో వసూళ్ల దందానా?విలేకరి అనే గుర్తింపును అడ్డుపెట్టుకొని వైన్‌షాపులు, కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని ఫోర్స్ నాయకత్వం పేర్కొంది. వీడియోలు తీస్తామంటూ బెదిరించడం, వార్తలు ప్రచురిస్తామంటూ ఒత్తిడి చేయడం, వ్యక్తిగత వ్యవహారాలను అడ్డుపెట్టుకొని ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నించడం వంటి ఆరోపణలు నిజమైతే వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.అక్రిడిటేషన్ కార్డు వసూళ్లకు లైసెన్సు కాదని, విలేకరి గుర్తింపు బెదిరింపులకు ఆయుధం కాకూడదని స్పష్టం చేసింది.మద్యం మత్తులో వివాదాలు.. కెమెరా పేరుతో బెదిరింపులా?ఇటీవల భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మద్యం మత్తులో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ విలేకరి, మరో రాజకీయ నాయకుడి మధ్య చోటుచేసుకున్న వివాదం పాత్రికేయ వృత్తి గౌరవంపై చర్చకు దారితీసిందని పేర్కొన్నారు. అలాగే కొందరు వ్యక్తులు వీడియోలు తీస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు.ఈ ఘటనలకు సంబంధించి ఇరు పక్షాల వాదనలు, అందుబాటులో ఉన్న ఆధారాలు పరిశీలించి అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. వ్యక్తిగత కక్షలు, రాజకీయ విభేదాలు, స్వప్రయోజనాల కోసం కెమెరాను ఉపయోగించడం పాత్రికేయ ధర్మం కాదని పేర్కొన్నారు.నిజాయితీగా పనిచేసే పాత్రికేయుల ప్రతిష్ఠను కాపాడాలిప్రజా సమస్యల పరిష్కారం కోసం పగలు, రాత్రి తేడా లేకుండా శ్రమిస్తూ, అధికారుల ఒత్తిళ్లు, రాజకీయ బెదిరింపులు, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న నిజాయితీగల పాత్రికేయులు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. కొందరి వ్యవహారాల కారణంగా మొత్తం పాత్రికేయ సమాజం అపవాదును ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు.నకిలీ గుర్తింపులు, వృత్తి ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై విచారణ కోరడం నిజమైన జర్నలిస్టులను అవమానించడం కాదని, వారి వృత్తి గౌరవాన్ని కాపాడటమేనని స్పష్టం చేశారు.జర్నలిస్టు సంఘాలు తమ వైఖరిని స్పష్టం చేయాలిజర్నలిస్టుల హక్కుల కోసం పోరాడే సంఘాలు వృత్తి గౌరవాన్ని కాపాడే విషయంలోనూ ముందుండాలని ఫోర్స్ నాయకత్వం సూచించింది. ఏ సంఘానికి చెందిన వారైనా, ఏ పత్రికలో పనిచేస్తున్నా తప్పు చేసినట్లు తేలితే విచారణకు అతీతులు కారని పేర్కొంది. సంఘాల ఐక్యత అంటే తప్పులను సమర్థించడం కాదని, బాధిత పాత్రికేయులకు అండగా నిలవడంతో పాటు వృత్తి ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలను ప్రశ్నించడం కూడా సంఘాల బాధ్యతేనని తెలిపింది.అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ సంధిస్తున్న ఆరు ప్రశ్నలుజర్నలిజంపై కనీస అవగాహన, వృత్తిపరమైన నైపుణ్యం లేని వ్యక్తులు విలేకరులుగా ఎలా చలామణి అవుతున్నారు?అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అర్హతలు, నిబంధనలు, పారదర్శకత పాటిస్తున్నారా?విలేకరి హోదాను అడ్డుపెట్టుకొని వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ ఎందుకు జరగకూడదు?వ్యక్తిగత కక్షలతో వీడియోలు తీసి బెదిరించడం, వార్తల పేరుతో ఒత్తిడి చేయడం పాత్రికేయ ధర్మమా?ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై జర్నలిస్టు సంఘాలు ఎందుకు స్పష్టమైన వైఖరి ప్రకటించడం లేదు?నిజాయితీగా పనిచేస్తున్న పాత్రికేయుల గౌరవం, భద్రత, వృత్తిపరమైన ప్రతిష్ఠను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది?హక్కుల కోసం పోరాటం.. అక్రమాలపై నిరంతర ప్రశ్నఅఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, జర్నలిస్టుల హక్కులు, భద్రత, ఆత్మగౌరవం, వృత్తిపరమైన స్వేచ్ఛ కోసం పనిచేసే ఉద్యమ వేదిక అని నాయకత్వం పేర్కొంది. ఏ సంఘానికి చెందిన వారైనా, ఏ పత్రికలో పనిచేసినా, ఏ మాధ్యమంలో వార్తలు అందిస్తున్నా నిజాయితీగా పనిచేసే ప్రతి పాత్రికేయుడి హక్కుల పరిరక్షణకు ఫోర్స్ కట్టుబడి ఉంటుందని వెల్లడించింది.అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ముందుగానే దోషులుగా నిర్ధారించకుండా, నిష్పక్షపాత విచారణ జరిపి తప్పు నిరూపితమైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కూడా తమ వాదన వినిపించే అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది.కలం ప్రజల కోసం.. కెమెరా సత్యం కోసం!జర్నలిస్టు అంటే సమాజంలో భయాన్ని సృష్టించే వ్యక్తి కాదు.. సమాజంలో ఉన్న భయాన్ని తొలగించే వ్యక్తి కావాలి. కలం అవినీతిని ప్రశ్నించాలి. కెమెరా వాస్తవాలను చూపించాలి. వార్త ప్రజలకు మార్గదర్శకంగా నిలవాలి. గుర్తింపు కార్డు బాధ్యతను గుర్తుచేయాలి.అక్రిడిటేషన్ కార్డు హోదాకు గుర్తింపు కావచ్చు.. కానీ అది నిజాయితీకి ధ్రువపత్రం కాదు. జర్నలిజం ప్రజాస్వామ్యానికి కాపలాదారు. ఆ పవిత్రమైన వృత్తి ముసుగులో ఎవరైనా స్వప్రయోజనాలకు పాల్పడితే సమాజం ప్రశ్నించాల్సిందేనని ఫోర్స్ నాయకత్వం పేర్కొంది.సత్యం కోసం కలం.. ధర్మం కోసం పోరాటం.. న్యాయం కోసం నిరంతర ఉద్యమం అనే నినాదంతో నిజమైన పాత్రికేయుల హక్కులు, గౌరవం, భద్రత కోసం నిరంతరం కృషి చేస్తామని రాష్ట్ర చైర్మన్ చంచు కుమార్, రాష్ట్ర అధ్యక్షులు పర్కాల సమ్మయ్య గౌడ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

ఏపీ వ్యాప్తంగా ప్రారంభమైన
ఎన్నికల సామగ్రి పంపిణీ

- ఏపీ మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు
- అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీజీపీ హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రేపు జరగనున్న పోలింగ్ కోసం ఈ ఉదయం నుంచే ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా నియమించిన పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పంపిణీ కేంద్రాలకు చేరుకుని బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని అందుకుంటున్నారు. రాష్ట్రంలోని 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక, నగర పంచాయతీలతో సహా మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మొత్తం 6,669 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, 4,372 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు 36,351 మంది పోలీసు సిబ్బందితో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇందులో 671 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, 1,233 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి అదనపు భద్రతను కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించాలని లేదా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటాం. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. నవంబర్ 2న అవసరమైన చోట రీ-పోలింగ్ నిర్వహించి, నవంబర్ 3న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు.

ఆదివారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్..అంతా సిద్ధం

అమరావతి రాష్ట్రంలో ఆదివారం మునిసిపల్ ఎన్నికలకు అంతా సిద్ధం అయింది. 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీల్లో పోలింగ్ జరగనుంది. శనివారం పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సుల పంపిణీ జరిగింది. ఆదివారం ఉదయం .7 నుంచి సాయంత్రి .5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మున్సిపల్ ఎన్నికలకు 36,351 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసారు. 4,372 పోలింగ్ స్టేషన్ల పరిధిలో బందోబస్తు కుడా ఏర్పాటు చేసారు. 671 అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. 1,233 సమస్యాత్మక కేంద్రాల్లో పోలీసులు మోహరించారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర పోలీస్ నిఘా పెడుతున్నారు. ఎన్నికల పర్యవేక్షణకు 1,543 రూట్ మొబైల్ బృందాలు రంగంలో వుంటాయి. 111 స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర 4,655 మంది పోలీసులు కాపాలాగా వుంటారు. ఎన్నికల సంబంధిత కేసుల్లో 107 మంది అరెస్ట్ అయ్యారు. నవంబర్ 2న అవసరమైన చోట రీపోలింగ్ జరుపుతారు. నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో అవేర్నెస్ వాక్

హైదరాబాద్ అవినీతి రహిత దేశ నిర్మాణం లక్ష్యంగా ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలని బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జోనల్ జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్. సుధాకర్ పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో అవేర్నెస్ వాక్ ను నిర్వహించారు. హిమాయత్నగర్లోని బ్యాంకు జోనల్ కార్యాలయం నుంచి బషీర్బాగ్ చౌరస్తా వరకు సాగిన ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. 'సత్యనిష్ఠతో సమృద్ధి' నినాదంతో ప్రజల్లో అవినీతి వ్యతిరేక చైతన్యం కల్పిస్తున్నట్లు సుధాకర్ తెలిపారు. ఉద్యోగుల్లో నైతిక విలువలు, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. అవినీతి సమాజాన్ని పట్టిపీడిస్తున్న జబ్బు అని, దానిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా యువత అవినీతిపై పోరాటంలో ముందుండాలని పిలుపునిచ్చారు. అవినీతి రహిత దేశ నిర్మాణమే లక్ష్యంగా నినాదాలు చేస్తూ ఉద్యోగులు అవేర్నెస్ వాక్ లో పాల్గొన్నారు.

చేయూత పింఛన్లపై కీలక నిర్ణయం

- తక్షణ మంజూరు విధానం మరికొన్ని కేటగిరీలకు
- 15 రోజుల్లోగా దరఖాస్తు.. మరుసటి నెల నుంచి పింఛన్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్లకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం చేయూత పథకం కింద పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే వెంటనే భార్యకు పింఛన్ మంజూరు చేసే విధానం అమల్లో ఉంది. తాజాగా ఈ విధానాన్ని మరింతగా విస్తరించింది. ఇకపై దివ్యాంగులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా, గీత, చేనేత కార్మికుల పింఛనుదారులకూ కూడా ఈ విధానాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చేనేత, గీత కార్మికులు దివ్యాంగులు, ఇతర కేటగిరీల్లో పింఛను అందుకునే జీవిత భాగస్వామి చనిపోతే మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని గమనించిన ప్రభుత్వం వారికి అండగా నిలిచేందుకు తక్షణ పింఛను సాయం అందించాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం రావడంతో ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు, దీంతో అధికారులు వెంటనే ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ చేయూత పథకం కింద పింఛన్లకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు కూడా ఉన్నాయి.దివ్యాంగ, గీత, చేనేత కార్మికులు సహా ఆయా కేటగిరీల కింద పింఛన్ పొందుతూ మరణించిన లబ్ధిదారుడి భార్య వయస్సు 57 ఏళ్ల కంటే తక్కువగా ఉంటే వితంతు పింఛను ఇస్తారు. ఒకవేళ 57 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉంటే వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తారు. ఈ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు 15 రోజుల్లోగా భార్య ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛనుదారుడి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. ఈ డాక్యుమెంట్లను గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్‌కు దరఖాస్తుతో పాటుగా అందజేయాలి. అనంతరం సంబంధిత అధికారులు ఈ పత్రాలను పరిశీలిస్తారు ఆ తర్వాత చేయూత పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు నమోదు చేసి అర్హత ధ్రువీకరించుకున్న తర్వాత పింఛన్ మంజూరు చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఎంతోమందికి ఊరట లభించనుంది.

భళా.. బాపట్ల బ్లాక్ రైస్!

బీపీటీ 2841 రకం నల్ల బియ్యం వంగడాన్ని బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రోగనిరోధక శక్తిని పెంపొందించే యాంటీ ఆక్సిడెంట్లతో పాటు ఐరన్, జింక్ వంటి సూక్ష్మపోషకాలను పుష్కలంగా కలిగి ఉండటం.. పంట పడిపోకుండా ఉండటం, చీడపీడలను తట్టుకోవటం, ఎకరానికి 30-35 బస్తాల దిగుబడినివ్వటం దీని ప్రత్యేకతలు. రైతుల పొలాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయించగా వరుసగా మూడేళ్ల సత్ఫలితాలు వచ్చాయి. సేంద్రియ/ప్రకృతి సేద్యానికి అనువైన ఈ విశిష్ట వంగడం అధికారిక విడుదలకు సిద్ధమవుతోంది. ఆరోగ్యకరమైన ఆహారం గురించి వినియోగదారుల్లో ఇటీవల అవగాహన పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వలన పోషకాలు కలిగిన ఆహార పదార్థాల వాడకం పెరిగింది.

సేంద్రియ ఆహారోత్పత్తులపై కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నందున నలుపు, ఎరుపు దేశవాళీ వరి రకాల సాగు, వాడకం క్రమక్రమంగా పెరుగుతోంది. కోతకు ముందు పడిపోవటం, దిగుబడులు తక్కువగా ఉండటం వంటి సమస్యలను తట్టుకునే సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పూర్వరంగంలో బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎకరానికి 30-35 బస్తాల దిగుబడినిచ్చే బీపీటీ 2841 బ్లాక్ రైస్ వంగడాన్ని అభివృద్ధి చేయటం విశేషం.

130-140 రోజుల పంట యం.టి.యు. 7029, ఐ.ఆర్.జి.సి. 18195, యం.టి.యు. 1081 అనే రకాల సంకరం ద్వారా బీపీటీ 2841 సన్న రకం బ్లాక్ రైస్ వంగడాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. డా. బి. కృష్ణవేణి, డా. డి. సందీప్ రాజా, డా. సి.వి. రామారావు, డా. వై. సునీత, డా. కె.ఎ. మృదుల ఈ వంగడాన్ని అభివృద్ధి చేశారు. 2019-20 ఖరీఫ్ సీజను నుంచి రైతు క్షేత్రాల్లో మినీ కిట్ పరీక్షల నిర్వహణకు అనుమతి పొందింది.దీని పంట కాలం 130-140 రోజులు. ఈ రకం దాదాపు 110 సెం.మీ. ఎత్తు పెరుగుతుంది. పడిపోదు. దోమపోటు, అగ్గి తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. మధ్యస్థ సన్న రకం. వెయ్యి గింజల బరువు సుమారు 14-14.5 గ్రాములు. పైపొట్టును మాత్రమే తొలగించినప్పుడు (దంపుడు బియ్యం) 76.6% రికవరీనిస్తుంది. పాలిష్ చేస్తే 66% రికవరీనిస్తుంది. దంపుడు బియ్యం తింటే దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పాలిష్ చేస్తే పై పొరలలోని నలుపు రంగులో ఉండే అంథోసైనిన్ తవుడులోకి వెళ్లి పోతుంది.

ఎకరానికి 35 బస్తాల దిగుబడి బీపీటీ 2841 రకం నారును 20"15 సెం.మీ. దూరంలో నాటుకుంటే హెక్టారుకు 6 టన్నుల వరకు దిగుబడినిస్తుంది. అయితే, పిలక చేసే సామర్థ్యం తక్కువ కాబట్టి 15"15 సెం.మీ. దూరంలో నాటుకుంటే (ఎకరానికి 20-25 కిలోల విత్తనం అవసరం) మంచిదని, ఇలా చేస్తే ఎకరానికి 35 బస్తాల (హెక్టారుకు 6.5 టన్నుల) వరకు దిగుబడి సాధించవచ్చని రైతుల అనుభవాల్లో తేలిందని బాపట్ల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త, చెప్పారు.

రోగనిరోధక శక్తే కీలకం బీపీటీ 2841 సన్న వరి బియ్యం రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఈ బియ్యం పైపొర నలుపు రంగులో ఉంటుంది. బియ్యానికి పై పొరలలోని నలుపు రంగు ఆంథోసైనిన్ అనే పదార్థం వల్ల వస్తుంది. మామూలుగా మనం రోజూ ఆహారంగీ తీసుకునే వరి రకాలతో పోల్చినప్పుడు నలుపు, ఊదా, ఎరుపు రంగు పై పొరగా కలిగినటువంటి వరి రకాలలో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ పరిమాణంలో ఉంటాయి.నలుపు రంగు బియ్యం పై పొరలలో ఉండే దట్టమైన నలుపు రంగునిచ్చే ఆంథోసైనిస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, సూపర్ ఫుడ్‌గా పిలవబడే బ్లూబెర్రీస్, బ్లాక్ బెర్రీస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లతో సమానమైన పోషక విలువలను కలిగి ఉన్నట్లు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. బీపీటీ 5204తో పోల్చితే యాంటీ ఆక్సిడెంట్లు బీపీటీ 2841 బ్లాక్ రైస్‌లో 3-4 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. పాలిష్ చేయని బీపీటీ 2841 దంపుడు బియ్యంలో వంద గ్రాములకు 90.52 మిల్లీ గ్రాముల ఫినాలిక్ పదార్థాలు, వంద గ్రాములకు 110.52 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు కోత బాపట్లలోని అనంతర సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ప్రయోగశాల పరీక్షల్లో వెల్లడైంది.5% పాలిష్ చేసిన బీపీటీ 2841 నల్ల బియ్యంలో కూడా వంద గ్రాములకు 90.19 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు తేలింది. అదే విధంగా, పై పొట్టు మాత్రమే తొలగించిన ముడి బియ్యంలో 11.02%, పాలిష్ బియ్యంలో 6.3% మాంసకృత్తులున్నాయి. సూక్ష్మపోషకాలైన జింక్, ఇనుప ధాతువులు కూడా బీపీటీ 2841లో ఎక్కువ పరిమాణంలో ఉండటం విశేషం. యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకున్నప్పుడు అవి శరీరంలో ఉత్పత్తయిన ఫ్రీరాడికల్స్‌ను సమతుల్యం చేయటం వలన పలు రకాల కేన్సర్లు, గుండె సంబంధిత సమస్య, మధుమేహం వంటి దీర్ఘకాలిక రుగ్మతలను ఎదుర్కొనే రోగనిరోధక శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

అన్వి... అన్నీ విశేషాలే!

ఏడాదిలోపు పిల్లలు పాకుతూ, పడుతూ లేస్తూ నడవడానికి ప్రయత్నిస్తూ పసి నవ్వులు నవ్వుతారు. వచ్చీరాని మాటలను పలుకుతూ ముద్దు లొలికిస్తుంటారు. "దాదాపు ఈ వయసువారంతా ఇలానే ఉంటారనుకుంటే మీరు పొరపడినట్లే. ప్రతిభకు వయసుతో సంబంధంలేదు. మాలాంటి చిచ్చర పిడుగులు బరిలో దిగితే అచ్చెరువు చెందాల్సిందే" అంటోంది అన్వి విశేష్ అగర్వాల్. రెండున్నరేళ్ల వయసున్న అన్వి తన పెయింటింగ్స్‌తో ఏకంగా గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకి ఎక్కింది. రెండేళ్లకే ఈ రికార్డు సాధిస్తే ఇక పెద్దయ్యాక ఇంకెన్ని అద్భుతాలు చేస్తోందో అని అవాక్కయ్యేలా చేస్తోంది చిన్నారి అన్వి. భువనేశ్వర్‌కు చెందిన అన్వి విశేష్ అగర్వాల్ 72 చిత్రాలను గీసి అతి చిన్నవయసులో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. ఎక్కువ సంఖ్యలో పెయింటింగ్స్ వేసిన అతిపిన్న వయస్కురాలుగా నిలిచి

లండన్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. రెండున్నరేళ్ల పాప ఇన్ని రికార్డులు సాధించిందంటే చాలా విచిత్రంగా ఉన్నప్పటికీ ఇది అక్షరాలా నిజం. అన్వి పెయింటింగ్ జర్నీ కేవలం తొమ్మిది నెలల వయసులోనే జరగడం విశేషం. అప్పటినుంచి పెయింటింగ్స్ వేస్తూనే ఉంది."మ్యాగ్నెంట్, పెండులమ్, కలర్స్ ఆన్ వీల్స్, రిఫ్లెక్షన్ ఆర్ట్, హెయిర్ కాంబ్ టెక్చర్, రీ సైక్లింగ్ ఓల్డ్ టాయిస్, హ్యూమన్ స్పైరోగ్రఫీ, దియా స్ప్రే పెయింటింగ్, బబుల్ పెయింటింగ్" వంటి 37 రకాల పెయింటింగ్ టెక్నిక్స్‌ను ఆపోశన పట్టింది. పెయింటింగేగాక పంతొమ్మిది నెలల వయసు నుంచే స్పానిష్ భాషలో మాట్లాడడం ప్రారంభించింది.

42 అక్షర మాల శబ్దాలను స్పష్టంగా పలుకుతూ 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. అత్యంత అరుదైన చిన్నారులు మాత్రమే ఇవన్నీ చేయగలుగుతారు.అన్నట్లు అన్వి అందర్నీ అబ్బురపరుస్తోంది.

సులువులైన చిట్కాలతో
చాక్లెట్ సమోసా-అంజీర్ హల్వా

కావలసినవి: మైదా పిండి - 1 కప్పు, పంచదార పొడి 5 టేబుల్ స్పూన్లు, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు, డార్క్ చాక్లెట్ పౌడర్ 1 కప్పు, పిస్తా ముక్కలు 1 టేబుల్ స్పూన్పంచదార పాకం అభిరుచిని బట్టి (అప్పటికప్పుడు కావాల్సినంత పంచదార, నీళ్లు పోసుకుని స్టవ్ మీద పెట్టుకోవాలి), నీళ్లు సరిపడాతయారీ: ముందుగా ఒక బౌల్‌లో మైదాపిండి, నెయ్యి, 4 టేబుల్ స్పూన్ల పంచదార పొడి, నీళ్లు పోసుకుని బాగా కలిపి.. కొద్దికొద్దిగా నీళ్లు కలుపుకుంటూ చపాతీ ముద్దలా చేసుకుని ఓ పావు గంట పాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.ఈ సమయంలో ఒక బౌల్ తీసుకుని అందులో చాక్లెట్ పౌడర్, పంచదార పౌడర్, పిస్తా ముక్కలు వేసుకుని అటు ఇటుగా కలిపి.. పక్కన పెట్టుకోవాలి. పావు గంట తర్వాత ఫ్రిజ్‌లోంచి మైదా ముద్దను తీసి.. చిన్న చిన్న పూరీల్లా చేసుకుని.. ప్రతి పూరీలో కొంత చాక్లెట్ మిశ్రమం పెట్టుకుని సమోసాలా చుట్టుకోవాలి. అనంతరం రెండు స్టవ్‌లు ఆన్ చేసుకుని.. ఒకవైపు నూనె కళాయి, మరోవైపు పంచదార పాకం ఉన్న కళాయి పెట్టుకుని సమోసాలను నూనెలో దోరగా వేయించి.. వెంటనే పాకంలో వేసి తీసుకోవాలి. ఒకవేళ పాకంలో వేసుకోవడం ఇష్టం లేకుంటే చాక్లెట్ సాస్‌ని పైన గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

అంజీర్ హల్వా కావలసినవి: డ్రై అంజీర్ 400 గ్రా.(నానబెట్టి, ముక్కలు చేసుకోవాలి) బియ్యప్పిండి/మొక్కజొన్న పిండి 5 టేబుల్ స్పూన్లు(5 టేబుల్ స్పూన్ల నీళ్లనూ జతచేసి బాగా కలుపుకోవాలి), నెయ్యి 9 టేబుల్ స్పూన్లు లేదా అంతకు మించి, పచ్చిపాలు అర కప్పు, పంచదార అభిరుచిని బట్టి, ఫుడ్ కలర్ కొద్దిగా (గ్రీన్ కలర్), యాలకుల పొడి కొద్దిగా, డ్రై ఫ్రూట్స్ ముక్కలు కొద్దిగా తయారీ: ముందుగా పాన్ లో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేసుకుని, వేడి కాగానే.. అందులో బియ్యప్పిండి /మొక్కజొన్నపిండి మిశ్రమం వేసుకుని గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు పోసుకుని చిన్న మంటపైన గరిటెతో తిప్పుతూ మరిగించుకోవాలి. తర్వాత ఒక కప్పు పంచదార వేసుకుని కరిగే వరకూ గరిటెతో తిప్పుతూ ఉండాలి. అందులో అంజీర్ ముక్కలు, ఫుడ్ కలర్ వేసుకుని మధ్య మధ్యలో కొద్దికొద్దిగా నెయ్యి వేసుకుంటూ తిప్పుతూ ఉండాలి. దగ్గర పడిన తర్వాత ఒకసారి తీపి సరిపోయిందో లేదో చూసుకుని అవసరమైతే మరికొద్దిగా పంచదార వేసుకుని, మిగిలిన నెయ్యి కూడా వేసుకుని గరిటెతో కలుపుతూ దగ్గర పడే సమయంలో యాలకుల పొడి వేసుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అభిరుచిని బట్టి నచ్చిన డ్రై ఫ్రూట్స్ ముక్కలతో గార్నిష్ చేసుకోవచ్చు లేదా.. నచ్చిన ఫ్లేవర్ ఐస్ క్రీమ్‌తో కలిపి తింటే భలే రుచిగా ఉంటుంది ఈ హల్వా.

పీయూష్, ఆమ్‌కా పన్నా, జల్‌జీరాతో కడుపు చల్లగా..

మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల్లో వేసవిలో 'పీయూష్' అనే పానీయాన్ని విరివిగా తాగుతారు. దాదాపు దీని తయారీ లస్సీ మాదిరిగానే ఉంటుంది. బాగా చిలికిన పెరుగులో పంచదారతో పాటు శ్రీఖండ్ అనే సంప్రదాయ మిఠాయిని, జాజికాయ పొడి, ఏలకుల పొడి వంటివి చేర్చడం వల్ల దీనికొక విలక్షణమైన రుచి ఏర్పడుతుంది. 'పీయూషం' అంటే అమృతం అనే అర్థం ఉంది. 'పీయూష్' పానీయం అమృతసమానంగా ఉంటుందని మరాఠీ, గుజరాతీ ప్రజలు చెబుతారు.ఉత్తరాది రాష్ట్రాల్లో జల్‌జీరా, ఆమ్ కా పన్నా, ఖస్‌ఖస్, రూహ్ అఫ్జా వంటి సంప్రదాయ పానీయాలను వేసవిలో విరివిగా వినియోగిస్తారు. జీలకర్ర, మిరియాలు వంటివి కలిపి తయారుచేసే జల్‌జీరాను సాధారణంగా భోజనానికి ముందు సేవిస్తారు. దీనివల్ల అలసట తీరి, ఆకలి పుడుతుందని, జీర్ణశక్తి మెరుగుపడుతుందని చెబుతారు. పచ్చి మామిడికాయలతో తయారుచేసే ఆమ్ కా పన్నా, వట్టివేళ్లు, గసగసాలు కలిపి తయారుచేసే ఖస్‌ఖస్ పానీయాలను కొన్ని ప్రాంతాల్లో ఇష్టంగా సేవిస్తారు. గులాబీరేకుల కషాయానికి చక్కెర పాకాన్ని జోడించి తయారు చేసే 'రూహ్ అఫ్జా'తో నేరుగా షర్బత్ తయారు చేసుకోవడమే కాకుండా, దీనిని లస్సీ, మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్‌ల వంటి వాటిలోనూ అదనపు రుచికోసం ఉపయోగిస్తారు. ఘజియాబాద్‌కు చెందిన హాఫీజ్ అబ్దుల్ మజీద్ అనే యునాని వైద్యుడు శతాబ్ది కిందట రూపొందించిన 'రూఫ్ అఫ్జా' భారత ఉపఖండమంతటా విరివిగా వినియోగంలో ఉంది.

కొన్ని ప్రాంతాల్లో చందనం పొడి, కుంకుమపువ్వు, పంచదార, నిమ్మరసం కలిపి తయారు చేసే చందన షర్బత్‌ను కూడా వేసవి పానీయంగా సేవిస్తారు.

ఇవన్నీ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా, వేసవితాపాన్ని తీర్చడంలో బాగా దోహ దపడతాయి.

ఈ వేసవిలో మీరూ వీటి రుచులను ఆస్వాదించండి.

తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతమే!

మారుతున్న జీవనశైలి కారణంగా ప్రస్తుతం చాలామంది అధిక బీపీతో బాధపడుతున్నారు. దీనిని ఆహారంతోనే అదుపు చేయవచ్చు. గుమ్మడి గింజల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియం ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. చేపలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి మన హృదయాన్ని ఫిట్‌గా ఉంచుతాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.

మీకు తెలుసా?

తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతం. డీ హైడ్రేషన్ వల్ల మైకం వచ్చి గుండె పనిచేయదు. గొంతు లేదా దవడలో నొప్పి కూడా గుండెపోటుకు సంకేతం. అయితే అన్ని నొప్పులు గుండెనొప్పులకి కారణమని చెప్పలేం. కొన్నిసార్లు ఇది జలుబు లేదా సైనస్ కారణంగా వస్తుంది.కానీ కొన్నిసార్లు ఛాతీ నొప్పి గొంతు నుంచి దవడకు వ్యాపిస్తుంది. ఇది చాలా ప్రమాదం. మీరు చాలా త్వరగా అలసిపోయినట్లనిపిస్తే బలహీనతగా భావించకండి. ఎందుకంటే ఇది కూడా గుండెపోటుకు కారణమయ్యే లక్షణాలలో ఒకటని గుర్తుంచుకోండి.

చెమట కాయలా?

చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి..

ఎండలు మండుతున్నాయి. దీంతో విపరీతమైన చెమట, దురదలతో చాలా ఇబ్బంది పడిపోతుంటారు. చర్మం తన మృదుత్వాన్ని కూడా కోల్పోతుంది. చెమటకాయలు దురదకు కారణమై, చికాకు, ఆయా భాగాలలో మంట, నొప్పికి దారితీస్తాయి. అతిగా చెమట పట్టే వారిలో వీటి సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.సాధారణంగా నుదుటిపై, ముఖం, మెడ, వీపు, ఛాతీ, తొడల మీద చెమట కాయలు వస్తుంటాయి. వీటి తీవ్రత ఎక్కువైతే చర్మం ఎర్రపొక్కులుగా మారటం, గోకటం వల్ల చర్మం చిట్లి రక్తం కారడం జరుగుతుంది. కొన్ని చిట్కాలతో కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో చూద్దాం. ?రెండు పూటలా స్నానం చేస్తూ శరీరాన్ని శుభ్రంగా వుంచుకోవాలి. చెమట ఎక్కువగా పట్టినప్పుడు స్నానం చేయడం, లేదా తడి వస్త్రంతో శరీరాన్ని తుడవడం తప్పనిసరి. వదులుగా ఉండే పల్చని కాటన్ వస్త్రాలు వేసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి. దాంతో శరీరం చల్లగా ఉంటుంది. వీలైనంత వరకు ఎండలోకి వెళ్లకుండా చూసుకోవాలి.స్నానం చేసే నీటిలో గుప్పెడు మల్లెపూలు, జాజిపూలు లేదా వట్టివేళ్ల చూర్ణం వేసి గంటసేపు నాననిచ్చి, ఆ నీటితో స్నానం చేయడం మంచిది. ఇటువంటి స్నానం శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.వంటినిండా చెమటకాయలు వచ్చినప్పుడు గంధం ముద్దని పేలిన చోట పల్చని పూతలా వేసుకుంటే, మంట, దురద తగ్గుతాయి. ఇందులో కర్పూరాన్ని కలిపి పేలిన చోట లేపనంలా రాసినా కూడా సమస్య అదుపులోకి వస్తుంది. మార్కెట్లో లభ్యమయ్యే గంధం పొడిలో సహజత్వం ఉండదు. అందుకే గంధపు చెక్కని సానపై అరగదీసి, దాన్ని వాడటం శ్రేయస్కరం.చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి పల్చని లేపనంలా చెమట కాయలపై రాసినా మంచిదే. కలబంద గుజ్జుని రాసుకున్నా కూడా చెమటకాయల నుంచి ఉపశమనం కలుగుతుంది. తాటి ముంజెలలోని నీటిని చెమట కాయలపై రాసి, ఆరిన తర్వాత శుభ్రమైన వస్త్రంతో మృదువుగా తుడిచేయాలి. పుచ్చకాయ, కర్బూజా, కీరదోస, ముంజెలు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పల్చని మజ్జిగ... వంటి చలువచేసే పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. కారం, గరం మసాలా, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

బెజవాడలో త్రిముఖ పోరు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు కేంద్రబిందువైన విజయవాడ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. అధికార ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలో నిలవగా, ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ తరపున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మరోసారి పోటీ పడుతున్నారు. అయితే, ఈ ద్విముఖ పోరును అనూహ్యంగా త్రిముఖ సమరంగా మారుస్తూ మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా రంగానికి దిగడం బెజవాడ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. వామపక్షాలు , కాంగ్రెస్ పార్టీల ఐక్య మద్దతుతో ఆయన నిర్వహిస్తున్న ప్రచారం సాంప్రదాయ రాజకీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.మాజీ సీపీగా బెజవాడ నగరంపై పరిపూర్ణమైన పట్టు, శాంతిభద్రతలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు తన ప్రచారాన్ని ప్రత్యేక శైలిలో నిర్వహిస్తున్నారు. అవినీతి రహిత నగర పాలన, పన్నుల భారం తగ్గించడం, లంచాలు లేని సేవలు అనే నినాదాలతో మేధావులు, మధ్యతరగతి , విద్యాధికుల ఓటు బ్యాంక్‌ను ఆకర్షించేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తున్నారు. వామపక్ష బలానికి తోడు కాంగ్రెస్ పార్టీ మద్దతు లభించడం, అలాగే సీనియర్ ఐపీఎస్‌గా ఆయనకున్న నిష్కళంకమైన ఇమేజ్ ఏబీవీకి ప్రధాన బలంగా మారాయి. ఏ రాజకీయ పార్టీ బంధాలు లేకుండా, కేవలం విజయవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆయన విసురుతున్న సవాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మింగుడుపడటం లేదు.అయితే, ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న వంగవీటి రాధాకృష్ణకు బలమైన ప్రజాదరణ, వంగవీటి కుటుంబానికి నగరంలో ఉన్న అభిమానుల బలగం పెద్ద ప్లస్ పాయింట్. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. రాధాకృష్ణ, ఏబీ వెంకటేశ్వరరావు ఇద్దరూ ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా అత్యంత హుందాతనంతో ప్రచారం సాగిస్తుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలిచింది. రాధా సైతం నగరాభివృద్ధికి ఏబీవీ సలహాలు తీసుకుంటా అని ప్రకటించగా, ఏబీవీ కూడా మాది భావజాల పోరాటమే తప్ప వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు.మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి బీసీ సామాజిక వర్గ సమీకరణాలు, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులనే నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. అయితే, ఓట్ల చీలిక ఎవరికి లాభిస్తుందనేది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. నాన్-పొలిటికల్, న్యూట్రల్ ఓటర్లు, మార్పు కోరుకునే వర్గాలు గనక ఏబీవీ వైపు మొగ్గుపడితే కూటమి, వైసీపీ ఓట్ బ్యాంకుల్లో భారీగా గండిపడే అవకాశం ఉంది. బెజవాడ ఓటర్లు ఎప్పుడూ ఊహించని సంచలన తీర్పులకు వేదికగా నిలుస్తారనే చరిత్ర ఉండటంతో, ఏబీవీ గెలుపు అవకాశాలను రాజకీయ విశ్లేషకులు తోసిపుచ్చలేకపోతున్నారు. వంగవీటి రాధా పవర్ కేడర్, రాయన భాగ్యలక్ష్మి పార్టీ క్యాడర్ బలానికి ఎదురీదుతూ ఏబీ వెంకటేశ్వరరావు సృష్టిస్తున్న ఈ ట్రెండ్ బెజవాడ రాజకీయాల్లో కొత్త చరిత్రకు పునాది వేస్తోంది. సంప్రదాయ పార్టీల ధనప్రవాహం, కుల సమీకరణలను దాటుకుని, వామపక్షాల సంపూర్ణ సహకారంతో ఏబీవీ నిజంగానే బెజవాడ పీఠంపై సంచలనం సృష్టిస్తారా లేక కూటమి-వైసీపీల హోరాహోరీ మధ్య స్వతంత్ర హోదాకే పరిమితమవుతారా అనేది పోలింగ్ ఫలితాలు తేల్చనున్నాయి.

బెంగళూరు ప్యాలెస్ రగడ

- రాజకీయంగా డ్యామేజ్?

కడప : తెలుగు రాష్ట్రాల రాజకీయంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన వైఎస్సార్ కుటుంబంలో ఆస్తుల తగాదాలు ఇప్పుడు చౌరస్తాకు వచ్చాయి. వైఎస్ కుటుంబంలో ఇప్పటికే సరస్వతి పవర్ షేర్లతో పాటు పలు ఆస్తుల వ్యవహారాలు ఎన్‌సిఎల్‌టి కోర్టు మెట్లు ఎక్కగా, తాజాగా బెంగళూరులోని యలహంక ప్యాలెస్ వివాదం సరికొత్త రాజకీయ దుమారాన్ని రేపుతోంది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య సాగుతున్న ఈ శత్రుత్వంలో.. వైఎస్సార్ కూతురు షర్మిల తన కుమార్తె అంజలి వివాహ వేడుకను యలహంక ప్యాలెస్‌లో నిర్వహించాలని భావించడం, దానికి జగన్ భద్రతా కారణాలు చెబుతూ అనుమతించకపోవడం రాజకీయ వర్గాల్లో విస్తుపోయేలా చేస్తోంది.ఈ బెంగళూరు ప్యాలెస్ కేవలం ఒక విలాసవంతమైన భవనం మాత్రమే కాదు, వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే కుటుంబం కోసం నిర్మించిన ఆస్తి. గతం నుండి షర్మిల ఇక్కడ సుదీర్ఘకాలం నివాసముండటంతో పాటు, కుటుంబ అవసరాలకు ఇది నిలయంగా మారింది. అందుకే తన కూతురు వివాహ శుభలేఖలలో కూడా షర్మిల వివాహ వేదికగా యలహంక ప్యాలెస్‌ను ముద్రించి ఆహ్వానాలు కూడా పంచారు. అయితే, నా ఇంట్లోకి వివాహ కేటరింగ్, ఈవెంట్ మేనేజర్లు, ఫోటోగ్రాఫర్లు రావడం వల్ల నా భద్రతకు, ప్రైవసీకి తీవ్ర ముప్పు ఏర్పడుతుంది అంటూ జగన్ లేఖ రాయడం, హైదరాబాద్ లోటస్ పాండ్‌ను వాడుకోవాలని సూచించడంపై షర్మిల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ తండ్రి వైఎస్సార్ కట్టించిన ఆస్తిలో తనకూ సమాన హక్కు ఉందని ఆమె వర్గం సెంటిమెంట్ అస్త్రాన్ని బలంగా ప్రయోగిస్తోంది.ఈ వివాదంలో సామాజికంగా, రాజకీయంగా లభిస్తున్న ప్రజాభిప్రాయాన్ని గమనిస్తే, సానుభూతి పవనాలు పూర్తిగా షర్మిల వైపే వీస్తున్నాయి. ఎంత రాజకీయం ఉన్నా, కన్న చెల్లెలి కూతురు పెళ్లికి.. అదీ సొంత మేనకోడలి కళ్యాణానికి ప్యాలెస్‌ను తిరస్కరించడం ఏ రకమైన సంస్కృతి అని నెటిజన్లు, ప్రజలు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఏపీలోని ప్రత్యర్థి పార్టీలు ఎన్డీయే, టీడీపీ నేతలు కూడా జగన్ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. సొంత చెల్లెలికి, మేనకోడలికి న్యాయం చేయలేని నాయకుడు ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు? అంటూ చంద్రబాబు, నారా లోకేష్ విమర్శలు గుప్పిస్తుండటం వైఎస్సార్‌సీపీని తీవ్ర ఇరకాటంలో పడేసింది.ఇక పొలిటికల్ ఇమేజ్ పరంగా చూస్తే జగన్ మోహన్ రెడ్డికి ఈ ఘటన వల్ల జరిగే నష్టం అంతా ఇంతా కాదు. 2024 ఎన్నికల ఘోర పరాజయం తర్వాత వైఎస్సార్‌సీపీ మళ్లీ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, ఇటువంటి పర్సనల్ ఇష్యూస్ జగన్ ప్రజాదరణను మరింత దిగజారుస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యులు, వైఎస్ విజయమ్మ కూడా షర్మిల పక్షాన నిలబడటంతో.. జగన్ వద్ద పనిచేస్తున్న రాజకీయ సలహాదారులు, కోటరీ ఆయనకు సరైన సలహాలు ఇవ్వడంలో ఘోరంగా విఫలమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాంకేతిక, చట్టపరమైన, ప్రైవసీ సాకులు చెప్పి మేనకోడలి పెళ్లిని నిరోధించడం కంటే, పెద్ద మనసుతో వేడుకకు అనుమతిస్తే రాజకీయంగా పాయింట్లు స్కోర్ చేసే అవకాశం ఉండేదన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.జగన్ వైఖరి వెనుక ఉన్న పట్టుదల లేదా మంకుపట్టుదల ఆయనను రోజురోజుకూ జనాల్లో ప్రతికూల నాయకుడిగా నిలబెడుతోంది. నేను చెప్పిందే వేదం, నా మాటే శాసనం అనే దోరణి రాజకీయంలోనైనా, కుటుంబంలోనైనా దెబ్బతీస్తుందనేది ఈ ఉదంతం నిరూపిస్తోంది. ఒకవేళ భద్రతే కారణమైతే పగడ్బందీ సెక్యూరిటీ అరెంజ్‌మెంట్స్ చేసుకుని పెళ్లి జరిపించే అవకాశాలు ఉన్నప్పటికీ.. అంతగా భీష్మించుకుని కూర్చోవడం వల్ల వైఎస్సార్ అభిమానుల్లో సైతం జగన్ పట్ల తీవ్ర నైతిక అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ బెంగళూరు ప్యాలెస్ వివాదం కేవలం ఒక ఇల్లు లేదా కళ్యాణ వేదికకు పరిమితమైన సమస్య కాదు. వైఎస్ కుటుంబంలో ఏర్పడిన ఆస్తులు, రాజకీయ వారసత్వ పోరు క్లైమాక్స్‌కు చేరిందనడానికి ఇది స్పష్టమైన సంకేతం. సలహాదారుల లోపమో లేక సొంత పట్టుదలో కానీ, ఈ వివాదంలో జగన్ తన ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేసుకుంటుంటే.. షర్మిల మాత్రం బాధితురాలిగా ప్రజా సానుభూతిని కూడగట్టుకోవడంలో ముందంజలో ఉన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఆస్తుల రగడ కోర్టుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో, వైఎస్సార్‌సీపీపై ఎలాంటి రాజకీయ ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

రాఘవేంద్రరావు మరదలు, జగపతిబాబు చెల్లెలు..

గుంటూరు : గుంటూరు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణ కుటుంబ నేపథ్యంపై ఆసక్తికర సమాచారం వెలుగుచూసింది. ఆమె విజయాన్ని కాంక్షిస్తూ ఇద్దరు సినీ ప్రముఖులు వీడియో సందేశాలు విడుదల చేశారు. ఆ ఇద్దరూ లక్ష్మి అపర్ణకు దగ్గర బంధువులుగా చెబుతున్నారు. లక్ష్మి అపర్ణను గుంటూరు మేయరుగా గెలిపించాలని దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, ప్రముఖ హీరో జగపతిబాబు ప్రత్యేకంగా వీడియోలు విడుదల చేశారు. రాఘవేంద్రరావు, మేయర్ అభ్యర్థి లక్ష్మి అపర్ణ భర్త కోవెలమూడి రవీంద్ర సోదరులుగా చెబుతున్నారు. అదేవిధంగా లక్ష్మి అపర్ణ తనకు సోదరి అంటూ స్వయంగా జగపతిబాబు వెల్లడించారు. గుంటూరు టీడీపీ నేత, మాజీ మేయర్ రవీంద్ర అలియాస్ నాని రాజకీయాల్లో చాలా సీనియర్. అయినప్పటికీ ఆయన బంధుత్వంపై గుంటూరు వాసులకు తప్ప రాష్ట్రంలో ఇతర ప్రాంతాల వారికి తెలియదు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల పోరులో రవీంద్ర కుటుంబం దిగడంతో ఆయన బంధువులు బయటకు వస్తున్నారు. కోవెలమూడి లక్ష్మి అపర్ణను గెలిపించాలని కోరుతున్నారు. ఇందులో సినీ ప్రముఖులు అయిన రాఘవేంద్రరావు, జగపతిబాబు విడుదల చేసిన వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి గుంటూరు ప్రజలకు విన్నపం నా చెల్లి లక్ష్మి అపర్ణ మేయరుగా పోటీ చేస్తున్నారని జగపతిబాబు విడుదల చేసిన వీడియో ఆకట్టుకుంటోందని చెబుతున్నారు. ప్రజలు చాలా తెలివైన వారని, ఎవరిని గెలిపించాలో వారికి బాగా తెలుసు అన్న జగపతిబాబు గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించినట్లుగానే లక్ష్మి అపర్ణను గెలిపించాలని కోరారు. నా చెల్లికి మంచి మనసు ఉంది. సమర్థురాలు అంటూ ఆయన కితాబునిచ్చారు. ఇక జగపతిబాబు చెల్లెలుగా లక్ష్మి అపర్ణను పరిచయం చేయడంతో వారి మధ్య బంధుత్వంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.ప్రముఖ నిర్మాత వీబీ రాజేంద్రప్రసాద్ కుమారుడైన జగపతిబాబుకు ఇద్దరు సోదరులు మాత్రమే ఉన్నారని సమాచారం. అయితే లక్ష్మి అపర్ణ కుటుంబంతో దగ్గర సంబంధం ఉండటం, బంధుత్వం కారణంగా ఆమె సోదరి అవుతారని అంటున్నారు. మొత్తానికి గుంటూరు మేయరు అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణకు మద్దతుగా సినీ ప్రముఖులతోపాటు పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలు సైతం బయటకు వస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని అంటున్నారు. శుక్రవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియగా, సినీ ప్రముఖులు విడుదల చేసిన వీడియోలు మాత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

రాజకీయాల్లో బంధువులు...

- వేర్వేరు పార్టీల్లో కుటుంబసభ్యులు

విజయవాడ : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమరం రక్త సంబంధీకులు, బంధువుల మధ్య హోరాహోరీ పోరుగా రూపాంతరం చెందింది. రాజకీయ సమీకరణాలు, రిజర్వేషన్ల కేటాయింపుల పుణ్యమాని ఒకే కుటుంబానికి చెందిన వారు వేర్వేరు జెండాలు పట్టుకుని ఒకరిపై ఒకరు పోటీకి సిద్ధమవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎన్నికల వేళ పల్లెల్లో నెలకొన్న ఈ విచిత్రమైన వాతావరణం ఓటర్లతో పాటు స్థానికంగా హాట్ టాపిక్ అవుతోంది. మహిళా రిజర్వేషన్ అయిన చోట భార్యాభర్తలు కలిసి పోటీ చేస్తుంటే, మరికొన్ని చోట్ల ఒకే కుటుంబం నుంచి ఒకే స్థానానికి పోటీపడుతూ పదవి తమ గుమ్మం దాటకుండా చూపుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి స్థానాలు పదుల సంఖ్యలో ఉన్నట్లు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని కలివరం ఎంపీటీసీ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన తోడికోడళ్లు బుద్దేపు లక్ష్మి (తెలుగుదేశం పార్టీ), బుద్దేపు కూరమ్మ (వైఎస్సార్సీపీ) నామినేషన్లు దాఖలు చేశారు. ఒకప్పుడు ఇదే స్థానం కోసం అన్నదమ్ములు తలపడగా, ఇప్పుడు మహిళలకు రిజర్వు చేయడంతో తమ భార్యలను రణరంగంలోకి దించారని చెబుతున్నారు. ఇదే రీతిలో నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని మొగళ్లూరు ఎంపీటీసీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. ఈ స్థానం కోసం తోడికోడళ్లు అయిన కూకట్ల శంకరమ్మ (టీడీపీ), కూకట్ల ఉష (వైఎస్సార్సీపీ) సర్వశక్తులు ఒడ్డుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డులు ఎంపీటీసీ స్థానాల విభజన తీరు కుటుంబాల మధ్య రాజకీయ విభేదాలకు ఆజ్యం పోసింది. ఉమ్మడి కుటుంబాల్లో కలిసిమెలిసి ఉండే సొంత అన్నదమ్ములు, బావబావమరుదులు సైతం వేర్వేరు పార్టీల కండువాలు కప్పుకుని బరిలో నిలుస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ఎవరి పార్టీ వ్యూహాల్లో వారు బిజీగా ఉంటూ, బహిరంగ ప్రచారంలో ఒకరిపై ఒకరు విమర్శలు సంధించుకుంటున్న దృశ్యాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇక కాకినాడ జిల్లా రౌతులపూడిలో అయితే ఒకే కుటుంబం నుంచి భార్యాభర్తలు పైలా అశోక్, సౌజన్యలు వేర్వేరు ఎంపీటీసీ స్థానాల నుంచి టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తుండగా, అదే కుటుంబానికి చెందిన లోవ కళ్యాణి (సౌజన్య ఆడపడుచు వరుస) జెడ్పీటీసీ స్థానానికి బరిలో నిలిచి వినూత్న రాజకీయం నడిపిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి గోదావరి జిల్లాలోని కడియం మండలంలో ఎంపీపీ పోరు రాజకీయంగా పీక్స్‌కి చేరింది. ఇక్కడ ఎంపీపీ పదవి జనరల్ మహిళకు కేటాయించడంతో ప్రముఖ నర్సరీ రైతులు తమ సకుటుంబంగా ఎన్నికల బరిలోకి దిగారు. కూటమి తరఫున బోడపాటి గోపాలకృష్ణ భార్య పుణ్యవతి, వైసీపీ తరఫున తాడాల విష్ణు చక్రవర్తి భార్య రాజరాజేశ్వరి ఈ పదవి కోసం పోటీపడుతున్నారు. కేవలం భార్యలే కాకుండా, ఆ భర్తలు కూడా వేర్వేరు ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేస్తుండటంతో ఈ కడియపులంక రాజకీయం రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. గ్రామాల్లో సొంత వాళ్ల పంచాయితీ నడుస్తుండటంతో ఓటర్లు డైలమాలో పడుతున్నారని చెబుతున్నారు. బంధుత్వానికి పెద్దపీట వేసి ఎవరికో ఒకరికి ఓటేయాలా? లేక తాము నమ్మిన పార్టీ సిద్ధాంతాలు, అభ్యర్థుల సమర్థతను బట్టి తీర్పునివ్వాలా? అని తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారని అంటున్నారు. ఎన్నికల పోరు ముగిసి, ఫలితాలు వెలువడిన తర్వాత గెలుపు ఓటముల ప్రభావం ఈ కుటుంబాల బాంధవ్యాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కామినేని ఆసుపత్రిలో

రోగి బంధువుల అందోళన

హైదరాబాద్ హైదరాబాద్ బొగ్గులకుంటలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 62 ఏళ్ల రోజమ్మకు జరిగిన వైద్య చికిత్సపై ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీన ఆసుపత్రిలో చేరిన సమయంలో రోజమ్మ ఆరోగ్యంగా ఉన్నారని, స్వయంగా నడుచుకుంటూ ఆసుపత్రికి వచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. మెడకు ఒకవైపు రక్తనాళంలో రక్తం గడ్డకట్టిందని, స్టెంట్ వేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించినట్లు చెప్పారు. అయితే స్టెంట్ వేయాల్సిన ప్రదేశంలో కాకుండా మరోవైపు స్టెంట్ అమర్చారని, ఈ చికిత్స అనంతరం రెండు వైపులా సమస్యలు తలెత్తి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని వారు ఆరోపించారు. ప్రస్తుతం రోజమ్మ కాళ్లు, చేతులు పనిచేయడం లేదని, పూర్తిగా మంచానికే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట మెగా శాంతో అనే వైద్యుడితో ఆపరేషన్ చేయిస్తామని చెప్పిన ఆసుపత్రి వర్గాలు, చివరకు సాకేత్ అనే వైద్యుడితో ఆపరేషన్ చేయించాయని తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఆపరేషన్ జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు రోజమ్మ మంచంపైనే ఉన్నారని పేర్కొన్నారు. రోగి పరిస్థితి ఇంత విషమంగా ఉన్నప్పటికీ ఆసుపత్రి యాజమాన్యం సరైన రీతిలో స్పందించడం లేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆసుపత్రి సీఈఓగా ఒక వ్యక్తిని పరిచయం చేయగా, ఆయనను ప్రశ్నించినప్పుడు తాను సీఈఓను కాదని, అడ్మిన్ మాత్రమేనని చెప్పినట్లు వెల్లడించారు.

నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ ర్యాలీ

- హాజరుకానున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హైదరాబాద్ 'లోక్‌తంత్ర బచావో ? బీడ్ తంత్ర హటావో' నినాదంతో నవంబర్ 2న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ర్యాలీకి కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నట్లు భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ వెల్లడించారు. మాదన్నపేటలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఐఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారి వివరాలను పరిశీలించకుండా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరోపణలకు వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి ప్రభా గౌడ్, నేతలు పుప్పాల శ్రీనాథ్, చంద్రశేఖర్, కామాటి మహేష్, డివిజన్ అధ్యక్షుడు యోగేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కారులో మంటలు..ప్రయాణికులు క్షేమం

రంగారెడ్డి బాటసింగారం గ్రామ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారిపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద విజయవాడ నుండి హైదరాబాదుకు వస్తున్న హుండై ఔ10 కార్లు అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి . క్షణాల్లో మంటలు కారు మొత్తం వ్యాపించడంతో అది గమనించిన డ్రైవింగ్ చేస్తున్న తాడేపల్లి ప్రవీణ్ వృత్తిరీత్యా ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఏఎస్ఓ కారు ఆపేసాడు. అదృష్ట శాత్తు కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అది గమనించిన స్థానికులు ఫైర్స్ సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు

మద్యం తాగేందుకు వెళ్లి.. విద్యుదాఘాతంతో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

మొయినాబాద్ : మద్యం తాగేందుకు బహిరంగ ప్రదేశానికి వెళ్లిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు విద్యుదాఘాతానికి గురయ్యారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నంలో పంట పొలానికి పందుల బెడద నుంచి రక్షణగా ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలకు తగిలి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న కేజీ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి పెద్దమంగళారం రెవెన్యూ పరిధిలోని పద్మావతి ఫంక్షన్ హాల్ వెనుక ఉన్న బహిరంగ ప్రదేశంలో మద్యం తాగేందుకు వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తుండగా అదే సమయంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం అటుగా వచ్చింది. దాన్ని చూసిన విద్యార్థులు భయపడి అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ క్రమంలో అడవి పందుల నుంచి పంట కాపాడుకునేందుకు ఓ రైతు పొలం చుట్టూ వేసిన విద్యుత్ తీగలకు తగిలారు. దీంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుల వివరాలను సేకరించారు. మృతులను అత్తాపూర్‌కు చెందిన మోక్ష సాయి చరణ్ (20), బల్కంపేటకు చెందిన యశ్వంత్ (20)గా గుర్తించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కాగా, పంట పొలం చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడమే ఇద్దరు విద్యార్థుల మృతికి కారణమైందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. పొలానికి విద్యుత్తు తీగలు ఏర్పాటు చేసిన రైతుపై కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

ఫుట్‌పాత్‌పై బైక్ నడిపితే రూ.5 వేలు..

- వన్‌వేలో వెళ్తే రూ.10 వేల ఫైన్? - బెంగళూరులో కఠినంగా ట్రాఫిక్ రూల్స్

బెంగళూరు బెంగళూరులో ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినతరం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. సగం హెల్మెట్ ధరించే వాళ్లపై ఫైన్లు వేయడంతో పాటు వాటిని అమ్ముతున్న వారిపై, తయారీదారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. అలాగే ఫుట్‌పాత్‌లపై బైకులు నడిపితే రూ.500 ఉన్న ఫైన్‌ను రూ.5వేలకు పెంచనున్నారు. వన్‌వేపై వెళ్తే వేసే వెయ్యి జరిమానాను రూ.10వేలకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, హోం శాఖలు సమర్పించిన ప్రతిపాదనలపై ప్రభుత్వం పరిశీలన జరుపుతున్నది.బుధవారం విధానసౌధలో హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే, రవాణా మంత్రి బి. సురేశ్ ఉన్నతాధికారులతో సంయుక్త సమీక్ష నిర్వహించారు. బెంగళూరులో ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంపై చర్చించారు. ఫుట్‌పాత్‌లపై వాహనాల నడపడం, వన్‌వే ఉల్లంఘనలు, అక్రమ పార్కింగ్, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదల, సిగ్నల్ ఉల్లంఘనలపై జరిమానాలు పెంచే ప్రతిపాదనలూ సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రస్తుతం ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహనం నడిపితే విధిస్తున్న రూ.500 జరిమానాను మొదటిసారి ఉల్లంఘనకు రూ.5,000కు, రెండోసారి ఉల్లంఘిస్తే రూ.10,000కు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వన్‌వే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ప్రస్తుతం ఈ ఉల్లంఘనకు రూ.1,000 జరిమానా ఉండగా.. దాన్ని పదిరెట్లు పెంచి రూ.10,000కు చేర్చాలని ప్రతిపాదించింది. రవాణా, హోం శాఖలు ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పించాయి. న్యాయశాఖ అభిప్రాయం తీసుకున్న తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నది. పదేపదే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు పాయింట్ల ఆధారిత డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని తీసుకురావడంపైనా అధికారులు చర్చించారు. వివిధ రకాల ఉల్లంఘనలకు నిర్దిష్ట పాయింట్లు కేటాయిస్తారు. ఒక డ్రైవర్ నిర్దేశిత పరిమితికి చేరుకుంటే అతడి డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసే అవకాశం ఉంటుంది. ఈ విధానం అమలుకు అవసరమైన చట్టపరమైన అంశాలపైనా సమీక్షించారు. రవాణా శాఖకు చెందిన సారథి వ్యవస్థను బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల ఈ-చలాన్ వ్యవస్థతో అనుసంధానించే అంశాన్ని కూడా పరిశీలించారు. దీనివల్ల వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటును పోలీసులు అక్కడికక్కడే తనిఖీ చేయగలుగుతారు. గతంలో చేసిన ట్రాఫిక్ ఉల్లంఘనల వివరాలనూ తెలుసుకోవచ్చు. కొత్తగా నమోదయ్యే ఉల్లంఘనలను నేరుగా డ్రైవర్ డిజిటల్ రికార్డుకు అనుసంధానించవచ్చు.

అడ్డూ, అదుపు లేకుండా

పెరుగుతున్న బియ్యం...

హైదరాబాద్ : తెలంగాణలో ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలతో అల్లాడుతున్న సామాన్యుడిని ఆదుకునే క్రమంలో.. సాధారణ ప్రజలు విస్తృతంగా వినియోగించే బీపీటీ రకం బియ్యం ధర కిలో రూ. 66 మించకూడదంటూ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మార్కెట్లో ప్రీమియం, సన్నబియ్యం ధరలు క్వింటాళ్లకు వేల రూపాయలు ఎగబాకి, కిలో రూ. 90 నుంచి రూ. 100 దాకా పలుకుతూ మధ్యతరగతి జేబులకు చిల్లులు వేస్తున్న వేళ.. ప్రభుత్వం కఠిన హెచ్చరికలు జారీ చేయడం ఊరటనిచ్చే అంశం. అయితే, గతంలోనూ ధరల నియంత్రణపై ఎన్నోసార్లు ఇలాంటి సమీక్షలు, గంభీర ప్రకటనలు వచ్చినప్పటికీ.. క్షేత్రస్థాయి రిటైల్ దుకాణాల్లో వ్యాపారులు వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా యథేచ్ఛగా దోపిడీ సాగించిన చేదు అనుభవాలు ఉన్నాయి.ఈసారి కేవలం మాటలతో సరిపెట్టకుండా పౌరసరఫరాలు, పోలీసు, జీఎస్టీ, లీగల్ మెట్రాలజీ వంటి ఐదు విభాగాలతో సంయుక్త తనిఖీలు చేపట్టడం, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో బేగంబజార్, నాంపల్లి, మహారాజ్‌గంజ్ వంటి ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లలో దాడులు చేసి 12 కేసులు నమోదు చేయడం ప్రభుత్వ సీరియస్‌నెస్‌ను సూచిస్తోంది. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లకు తరలించే మిల్లర్లు, హోల్‌సేలర్ల నెట్‌వర్క్‌ను గుర్తించి చర్యలు తీసుకోవడం మంచి పరిణామమే. అయితే, ఈ దాడులు కేవలం పెద్ద హోల్‌సేల్ మండీల వద్ద ఫోటోషూట్‌లకే పరిమితమైతే ఫలితం శూన్యం. నగరాలు, పట్టణాలు, పల్లెల్లో ఉండే చిన్న చిన్న కిరాణా షాపులు, రిటైల్ మార్కెట్ల దాకా నిరంతర నిఘా ఉంటేనే ఈ రూ. 66 ధరల పరిమితి ప్రజలకు వాస్తవంగా ఉపయోగపడుతుంది.రాష్ట్రంలో సరిపడా ధాన్యం నిల్వలు ఉన్నాయని, వినియోగదారులు భయాందోళనలకు గురై పెద్ద ఎత్తున నిల్వ చేసుకోవద్దని మంత్రి ధైర్యం చెబుతున్నప్పటికీ.. కొరత భయాన్ని తొలగించాల్సింది కేవలం మాటలతో కాదు, మార్కెట్ స్థిరీకరణతోనే. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని, వాటిని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆ బియ్యం పంపిణీ నాణ్యత, సరఫరా గొలుసులో ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత కూడా పౌరసరఫరాల శాఖపైనే ఉంది. రేషన్ బియ్యం నాణ్యతపై ప్రజల్లో నమ్మకం పెంచితే తప్ప ఓపెన్ మార్కెట్ బియ్యంపై ఆధారపడటం తగ్గదు. ఆర్ఎన్ఆ రకాల ధరలను కూడా సమీక్షిస్తామని చెబుతున్న సర్కారు.. కేవలం ఒకే రకంపై కాకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్న ఇతర నాణ్యమైన బియ్యం రకాలపై కూడా స్పష్టమైన ధరల పట్టికను అమలు చేయాల్సి ఉంది.టాస్క్‌ఫోర్స్ తనిఖీలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలన్న సూచనలు వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే బడా మిల్లర్ల లైసెన్సులు రద్దు చేయడం, అక్రమ నిల్వలను సీజ్ చేసి బహిరంగ మార్కెట్లలో రీజనబుల్ ధరకు అమ్మేలా చేయడం వంటి కఠిన చర్యలు చేపడితేనే వ్యాపారుల్లో భయం పుడుతుంది. అలా కాకుండా ఒకట్రెండు రోజుల హడావుడి తర్వాత తనిఖీలు చల్లబడితే.. వ్యాపారులు మళ్లీ కృత్రిమ కొరత సృష్టించి మరింత ఎక్కువ ధరలకు విక్రయించే ప్రమాదం ఉంది. పాలకుల చిత్తశుద్ధి ప్రభుత్వ ఆదేశాల జారీలో కాదు.. గల్లీలోని కిరాణా కొట్టులో సామాన్య వినియోగదారుడు సంచిలో బియ్యం పోయించుకునేటప్పుడు కనిపించే ధరలోనే ప్రతిబింబిస్తుందన్న నిజాన్ని ప్రభుత్వం విస్మరించకూడదు.

గాళ్స్ హాస్టల్ అడ్డగా... అండాల సేకరణ

హైదరాబాద్ : అది పేరుకే లేడీస్ హాస్టల్.. చేసేది అండాల బిజినెస్.. బేగంపేట ప్రకాష్‌నగర్‌లో బయటపడ్డ అండాల అక్రమ దందా.. హైదరాబాద్‌లో గర్ల్స్ హాస్టల్ పేరుతో నడుపుతున్న గలీజ్ దందా గుట్టురట్టు అయింది. బేగంపేటలో యువతుల అండాల సేకరణ ముఠా వ్యవహారం బట్టబయలు అయింది. బేగంపేట పోలీసులు, ఎస్ఓటీ పోలీసుల సంయుక్తంగా దాడుల్లో 10మంది యువతులు అడ్డంగా బుక్కవడం కలకలం రేపుతోంది. హైదరాబాద్ బేగంపేటలో యువతుల అండాల అక్రమ సేకరణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రకాష్‌నగర్‌లోని నగ్రాన్ అపార్ట్‌మెంట్‌లో గలీజ్ వ్యవహారం సాగుతున్నట్టు ఆరోపణలు రావడంతో పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. అర్ధరాత్రి 2గంటల సమయంలో బేగంపేట పోలీసులు, ఎస్ఓటీ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ దారుణ వ్యవహారం బయటపడింది. పోలీసులకు 10మంది యువతులు పట్టుబడటం సంచలనం రేపింది. వీరిని బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశాకు చెందిన యువతులుగా గుర్తించి.. అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో ఏడాదికాలంగా అమీ నీతా గర్ల్స్ హాస్టల్ పేరుతో ఈ అక్రమ అడ్డగోలు కార్యకలాపాలు సాగిస్తున్నట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలోనే.. అండాల సేకరణతో పాటు సంతాన సాఫల్య కేంద్రాలతో సంబంధాలపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. యువతుల నుంచి అండాలను సేకరించి సమీపంలోని సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళల అండాలతో పాటు పురుషుల వీర్యకణాల సరఫరాకు సంబంధించిన దందాపైనా పోలీసులు ఫోకస్ పెట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఓ మహిళ ప్రమేయం ఉందనే అనుమానంతో ఆమెను కూడా ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే.. అండాల అక్రమ సేకరణ, విక్రయాల వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే.. అండాల సేకరణలో యువతుల సమ్మతి ఉందా?.. డోనర్స్ విషయంలో అసలు మెడికల్ రూల్స్ పాటిస్తున్నారా?.. అండాల సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు?.. ఈ అండాలను ఏఏ ఫెర్టిలిటీ సెంటర్లకు పంపుతున్నారనే వివరాలను సేకరించే పనిలో పడ్డారు పోలీసులు.ఇక.. ప్రకాశ్‌నగర్‌లోని అమీ నీతా గర్ల్స్ హాస్టల్‌లో ఎప్పటినుంచో చాలా మంది మహిళలు ఉంటున్నారని స్థానికులు చెప్పారు. అంతా బయట రాష్ట్రాల యువతులేనని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి పక్కన అపార్ట్‌మెంట్లో పోలీసులు దాడులు చేయడంతో ఆందోళనకు గురయ్యామన్నారు స్థానికులు. తీరా చూస్తే.. కొంతమంది యువతులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసిందని చెప్పారు. మొత్తంగా.. హైదరాబాద్‌లో మరోసారి అండాలు, వీర్యకణాల అక్రమ సేకరణ దందా గ్యాంగ్ గుట్టు రట్టయింది.

రజనీకాంత్ 'జైలర్ 2'
అరుదైన రికార్డు..

- రూ.800 కోట్ల దిశగా పరుగులు, నాలుగు రాష్ట్రాల్లో సరికొత్త చరిత్ర!

సూపర్‌స్టార్ రజనీకాంత్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'జైలర్ 2' వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తూ దూసుకెళ్తోంది. 2023లో విడుదలై సంచలన విజయం సాధించిన 'జైలర్' చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధిస్తోంది. ఇప్పటికే రూ.800 కోట్ల మార్కుకు చేరువలో ఉన్న ఈ చిత్రం మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది.'జైలర్ 2' బాక్సాఫీస్ ప్రయాణంలో అత్యంత ప్రత్యేకమైన విషయం ప్రాంతాలవారీగా సాధించిన వసూళ్లు. తమిళనాడు, తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, కేరళ.. ఇలా నాలుగు ప్రాంతాల్లోనూ ఒక్కొక్కటిగా రూ.75 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి చిత్రంగా 'జైలర్ 2' కొత్త రికార్డు సృష్టించింది. సాధారణంగా ఒక సినిమా తన సొంత రాష్ట్రంలో భారీ వసూళ్లు సాధించడం సహజం. కానీ ఇతర భాషా ప్రాంతాల్లోనూ ఇదే స్థాయిలో ఆదరణ పొందడం విశేషం. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో రజనీకాంత్‌కు ఉన్న అభిమాన బలం మరోసారి నిరూపితమైంది. కర్ణాటక, కేరళలోనూ ఈ సినిమాకు మంచి స్పందన లభించడంతో ప్రాంతీయ హద్దులను దాటి తలైవా క్రేజ్ కొనసాగుతోందని ఈ వసూళ్లు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.800 కోట్ల దిశగా సాగుతున్న ఈ చిత్రం రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులను అందుకుంటుందా అన్న ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది.సన్ పిక్చర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించారు. ఆయనకు జోడీగా కాకుండా కథలో కీలక పాత్రల్లో విద్యాబాలన్, ఎస్.జే. సూర్య, సూరజ్ వెంజరమూడు, మిథున్ చక్రవర్తి, రమ్యకృష్ణ, మిర్నా మీనన్, నమో నారాయణ్ వంటి ప్రముఖ నటులు కనిపించారు. ఇక ఈ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా పలువురు స్టార్ హీరోల అతిథి పాత్రలు నిలిచాయి. హృతిక్ రోషన్, మోహన్‌లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రల్లో కనిపించడం సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. ముఖ్యంగా విభిన్న సినీ పరిశ్రమలకు చెందిన ప్రముఖ నటులు ఒకే సినిమాలో భాగం కావడం అభిమానులకు ప్రత్యేక అనుభూతిని అందించింది.

'డెమోక్రటిక్ సంఘ' నుంచి
తప్పుకున్న రెజీనా

ప్రముఖ నటి రెజీనా కసాండ్రా అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తాను సహ–వ్యవస్థాపకురాలిగా వ్యవహరించిన 'డెమోక్రటిక్ సంఘ' అనే స్వచ్ఛంద సంస్థ నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. సహ–వ్యవస్థాపకురాలిగా, సభ్యురాలిగా కూడా సంస్థ నుంచి వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కేంద్రంగా దీప్తి ఆలపాటితో కలిసి రెజీనా ఈ ఎన్జీవోను ప్రారంభించినట్టు తెలుస్తోంది. అయితే, సంస్థ నుంచి ఎందుకు వైదొలగుతున్నారనే కచ్చితమైన కారణాన్ని ఆమె వెల్లడించలేదు. "సుదీర్ఘ ఆలోచన, ఆత్మపరిశీలన తర్వాత, నేను 'డెమోక్రటిక్ సంఘ' నుంచి పూర్తిగా వైదొలగాలని నిర్ణయించుకున్నాను. ఈ సంస్థ వ్యవస్థాపకుడిగా, సభ్యుడిగా నా బాధ్యతల నుంచి, దానితో అనుబంధం ఉన్న అన్ని కార్యక్రమాల నుంచి తప్పుకుంటున్నాను. నా జీవిత ప్రయాణంలో 'డెమోక్రటిక్ సంఘ' ఒక అర్థవంతమైన భాగం. ఈ సంస్థతో ముడిపడిన అనుభవాలను, స్నేహాలను, మధుర జ్ఞాపకాలను ఎప్పటికీ నా మదిలో పదిలంగా ఉంచుకుంటాను. దాని వ్యవస్థాపక ప్రయాణంలో నేను ఒక భాగం కావడం విశేషమైన అవకాశంగా భావిస్తున్నాను. సంస్థ ఆశయాలకు, కార్యక్రమాలకు నా వంతు తోడ్పాటు అందించినందుకు గర్వపడుతున్నాను. జీవితంలో ముందుకు సాగుతున్న ఈ తరుణంలో, నేను ఒక భిన్నమైన మార్గాన్ని ఎంచుకోవడానికి, ఇతర ప్రాధాన్యతలపై దృష్టి పెట్టడానికి ఇదే సరైన సమయమని నమ్ముతున్నాను. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరిపై అపారమైన గౌరవంతో, కృతజ్ఞతతో, వెచ్చని జ్ఞాపకాలతో నేను ముందుకు సాగుతాను. నా ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన, ప్రోత్సాహాన్ని అందించిన నా సహచరులు, స్నేహితులు, శ్రేయోభిలాషులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీ స్నేహాన్ని ఎప్పటికీ మరువలేను. ఈ ప్రయాణానికి, నేను పొందిన అనుభవాలకు, నాకు పరిచయమైన గొప్ప వ్యక్తులకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడిగానే ఉంటాను. 'డెమోక్రటిక్ సంఘ'కు, దానితో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో అంతా మంచే జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మనం కలిసి పంచుకున్న మార్గాలకు నా హృదయపూర్వక గౌరవాన్ని తెలియజేస్తున్నాను" అంటూ రెజీనా తన ప్రకటనలో పేర్కొన్నారు.

రాజకుమారి శూర్పణ

నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ' ఫ్రాంచైజీలోని తొలిభాగం నవంబర్ 5న హిందీ, తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న విషయం తెలిసిందే. సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న ఈ పౌరాణిక ఇతిహాసం కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దాదాపుగా నాలుగు వేల కోట్ల నిర్మాణ వ్యయంతో నమిత్ మల్హోత్రా రెండు భాగాలుగా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలో రావణుడిగా కన్నడ అగ్ర హీరో యశ్ నటిస్తుండగా, మండోదరిగా కాజల్ అగర్వాల్, హనుమంతుడిగా సన్నిడియోల్, శూర్పణఖ పాత్రను రకుల్ ప్రీత్‌సింగ్ పోషిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ న్యూలుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. బంగారు ఆభరణాలు ధరించి, రాజసం ఉట్టిపడే వస్త్రాధారణతో రథంపై వస్తున్న రావణ సోదరి శూర్పణఖని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. వాల్మీకి రామాయణం శూర్పణఖను సౌందర్యరాశిగా పేర్కొన్నది. దానికి తగ్గట్టే శూర్పణఖగా రకుల్ ఈ పోస్టర్‌లో చాలా అందంగా కనిపిస్తున్నారు. ప్రముఖ పంపిణీ సంస్థ ఎస్‌వీసీ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ సినిమాలోని రెండో పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి రానున్నది.

ద్వంద్వ ప్రమాణాలపై
అనుపమ పరమేశ్వరన్ ఆవేదన

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో పెట్టిన ఒక ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మనుషుల ప్రవర్తనలోని ద్వంద్వ ప్రమాణాలపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.ద"ఒకప్పుడు మిమ్మల్ని తప్పు చేసినట్టు భావించేలా చేసిన పనులే, పాత్రలు తారుమారైనప్పుడు సర్వసాధారణంగా మారడం విచిత్రంగా ఉంటుంది" అంటూ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో అనుపమ పేర్కొన్నారు. సంతోషంగా ఉండటం, ఇష్టమైన వారిని మెచ్చుకోవడం వంటి చిన్న చిన్న విషయాలను కూడా తప్పుగా చిత్రీకరించారని, పదేపదే వివరణలు ఇచ్చుకునేలా చేసి, క్షమాపణలు చెప్పే స్థితికి నెట్టారని ఆమె వాపోయారు. అయితే, అవే పనులను ఇప్పుడు ఇతరులు ఎలాంటి మొహమాటం లేకుండా బహిరంగంగా చేస్తున్నారని, దీన్నిబట్టి "సమస్య మనం ఏం చేశామన్నది కాదు, అది ఎవరు చేశారన్నదే ముఖ్యం" అని తనకు అర్థమైందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తన ఫాలోవర్స్‌కు కూడా అనుపమ ఒక విజ్ఞప్తి చేశారు. ఎవరి కామెంట్‌కు రిప్లై ఇచ్చానో పోల్చి చూస్తూ తనకు ట్యాగ్‌లు, మెసేజ్‌లు పెట్టవద్దని కోరారు. "నాకు సోషల్ మీడియాకు అతీతంగా సొంత బాధ్యతలు, పోరాటాలు ఉన్నాయి. ఒత్తిడి కోసం ఆన్‌లైన్‌లో నటిస్తూ బతకలేను" అని ఆమె స్పష్టం చేశారు. కొద్ది రోజుల క్రితం ఒక ప్రేమ వ్యవహారం వల్ల మానసిక ప్రశాంతత కోల్పోయానని చెప్పిన అనుపమ, ఇప్పుడు ఈ పోస్ట్ పెట్టడంతో ఇది ఎవరిని ఉద్దేశించిందనే చర్చ జరుగుతోంది.

సినిమాలకు మించి వ్యాపారాల్లో
సమంత జోరు

- 8 నెలల్లోనే రూ.120 కోట్ల టర్నోవర్‌తో హాట్ టాపిక్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినిమాలతోనే కాకుండా వ్యాపార రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. నటిగా ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు పలు వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతూ వ్యాపారవేత్తగా ఎదుగుతున్నారు. ఇటీవల 'మా ఇంటి బంగారం' సినిమాతో విజయాన్ని అందుకున్న సమంత ప్రస్తుతం సినిమాలకు కొంత విరామం ఇస్తూ వ్యక్తిగత జీవితంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆమె స్థాపించిన పెర్ఫ్యూమ్ బ్రాండ్ 'సీక్రెట్ ఆల్కెమిస్ట్' భారీ టర్నోవర్ సాధించిందనే వార్త ఇప్పుడు చర్చనీయాంశంగా మారిం ది. సమంత కొన్ని నెలల క్రితం 'సీక్రెట్ ఆల్కెమిస్ట్' పేరుతో పెర్ఫ్యూ మ్ బ్రాండ్‌ను ప్రారంభిం చారు. అంకితా థడానీ, ఆకాష్ వాలి యాతో కలిసి ఈ వ్యాపారాన్ని స్థాపించారు. తాజాగా ఈ సంస్థ విజయాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ బ్రాండ్ ప్రారంభమైన కేవలం ఎనిమిది నెలల్లోనే సుమారు రూ.120 కోట్ల టర్నోవర్ సాధించిందనే ప్రచారం జరుగుతోంది. ఈ వార్త బయటకు రావడంతో సమంత వ్యాపార విజయంపై ఆసక్తికర చర్చ మొదలైంది. అయితే టర్నోవర్ అంటే కంపెనీ మొత్తం అమ్మకాల విలువ మాత్రమే. అది నికర లాభం కాదు. సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలు ఎంతన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. అయినప్పటికీ తక్కువ సమయంలోనే ఇంతటి వ్యాపారాన్ని సాధించిందనే ప్రచారం సమంత బ్రాండ్‌పై అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సమంతకు పెర్ఫ్యూమ్ వ్యాపారంతో పాటు పలు రంగాల్లో సంస్థలు, పెట్టుబడులు ఉన్నాయి. 'సాకి' పేరుతో దుస్తుల వ్యాపారం నిర్వహిస్తున్నారు. 'ఏకం' పేరుతో ప్రీ స్కూల్ రంగంలోనూ అడుగుపెట్టారు. 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరుతో నిర్మాణ సంస్థను స్థాపించారు. వీటితో పాటు పికిల్‌బాల్ రంగంలో 'చెన్నై సూపర్ ఛాంప్స్' జట్టుతోనూ ఆమెకు అనుబంధం ఉంది. ఇంకా పలు రంగాల్లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది.కరోనా సమయంలో, అలాగే మయోసైటిస్ సమస్యతో సినిమాలకు దూరంగా ఉన్న సమయంలో సమంత వ్యాపార రంగంపై పరిశోధన చేసి పెట్టుబడులు పెట్టినట్లు గతంలో వెల్లడైంది.

నిజాయతీగా చేసిన ప్రయత్నం

వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' చిత్రంశుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ(చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీనిధిశెట్టి కథానాయిక. శుక్రవారం సాయంత్రం బ్లాక్‌బస్టర్‌సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని ఆదరిస్తున్నప్రేక్షకులందరికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.ఇదొక కొత్త జోనర్. టీమంతా నిజాయతీగా పనిచేశాం. ఉదయం నుంచి అభినందనలు తెలియజేస్తూ నాకు ఫోన్లు వస్తూనే ఉన్నాయి. ఫ్యామిలీ ఆడియెన్స్‌కు మంచి సినిమాలు ఇవ్వాలని నేను ఎప్పుడూ నిజాయతీగా ప్రయత్నిస్తుంటాను' అన్నారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ 'ఇది ప్రేక్షకులు మాట్లాడాల్సిన సమయం. వారు మాట్లాడితే మనం వినాలి. ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీడియా మిత్రులు చాలా మంది ఫోన్లు చేసి అభినందించారు.ముఖ్యంగా ఇంటర్వెల్ బ్యాంగ్ అదిరిపోయిందన్నారు' అని పేర్కొన్నారు. కథానాయిక శ్రీనిధి శెట్టిమాట్లాడుతూ 'ఈరోజు థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య సినిమా చూశా. ప్రతి సన్నివేశానికి వారు క్లాప్స్ కొడుతూఎంజాయ్ చేస్తున్నారు. నేను పోషించిన స్వర్ణ పాత్ర కెరీర్‌లో చాలా ప్రత్యేకంగా నిలిచిపోతుంది. మంచిహాస్యంతో పాటు భావోద్వేగాలతో దర్శకుడు త్రివిక్రమ్ నా పాత్రను తీర్చిదిద్దాడు' అని చెప్పింది. త్రివిక్రమ్‌తోచాలా సినిమాలకు పనిచేశానని, ఆయన రామాయణంను తెరకెక్కిస్తే చూడాలన్నది తన అభిమతమనిసంగీత దర్శకుడు తమన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

రైతుల వ్యవసాయ అవసరాలకు సహకార సంఘం ద్వారా దీర్ఘకాలిక రుణాలు

- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని(ప్రశ్న న్యూస్)రైతుల ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని ద్వారా సంఘ సభ్యులకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నట్లు మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. శనివారం సంఘ కార్యాలయంలో సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య ల చేతుల మీదుగా రూ.26 లక్షల విలువగల దీర్ఘకాలిక రుణాల చెక్కులు అందజేశారు. షీప్ లోన్ కింద మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన జీల్ల వజ్రమ్మ కు రూ.5లక్షలు, కర్షకమిత్ర ద్వారా విలోచవరం గ్రామానికి చెందిన కొండ శంకరయ్యకు రూ.10లక్షలు, కొండ సమర సేన్ కు రూ.5లక్షలు, నాగారం గ్రామానికి చెందిన మారేపల్లి భాస్కర్ రెడ్డి కి రూ.6లక్షల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పెట్టుబడులతో పాటు ఇతర అవసరాలకు ఆర్థిక చేయూత అందించేందుకు సంఘం ద్వారా వివిధ రకాల దీర్ఘకాలిక రుణాలు అందజేస్తున్నామని తెలిపారు సంఘ సభ్యులు ఈ రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అర్హులైన సంఘ సభ్యులు అవసరమైన పత్రాలతో పీఏసీఎస్ మంథని కార్యాలయాన్ని సంప్రదించి రుణ సదుపాయాలను పొందాలని కొత్త శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్

ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాదు జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో ధర్పల్లి డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివస్ నీ ధర్పల్లి

డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస,చరిత్ర విభాగాల వారి ఆధ్వర్యంలో జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వతంత్ర భారత తొలి ఉప ప్రధాని,హోం శాఖ మంత్రి 1875 అక్టోబర్ 31 గుజరాత్ లోని నడియాడ్ లో జన్మించారు, ఇతనిని భారత దేశ ఉక్కుమనిషిగా పేర్కొంటారు.స్వాతంత్ర అనంతరం భారతదేశంలోని ఐదువందల పైచిలుకు సంస్థానాలను విలీనం చేశారు, అందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలకు గుర్తుగా 2014 నుంచి ప్రతి సంవత్సరం అక్టోబర్ 31వ తేదీన రాష్ట్రీయ ఐక్యత దినోత్సవం గా నిర్వహిస్తున్నారు.గుజరాత్ లోని నర్మదా నది ఒడ్డున సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మారకార్థం ప్రపంచంలోని అత్యంత ఎత్తైన 182 మీటర్స్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ఏర్పాటు చేశారు. ఇతనిని విద్యార్థిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ జ్యోతి మేడం తెలిపారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ వారి ఆధ్వర్యంలో అక్టోబర్ 26 నుండి నవంబర్ 1 వరకు సమృద్ధి కోసం సత్యనిష్టి అనే ఇతివృత్తంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు జరుగుతున్నాయి అందులో భాగంగా మా కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధ నేతల సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్‌లో బియ్యం దుకాణాల తనిఖీలు

ట్రేడ్ షాపుల్లో బియ్యం నిల్వలపై సివిల్ సప్లై అధికారుల పరిశీలన

శంషాబాద్ (ప్రశ్న న్యూస్) శంషాబాద్ పట్టణ పరిధిలోని పలు ట్రేడ్ షాపుల్లో సివిల్ సప్లై అధికారులు బియ్యం నిల్వలను తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, విక్రయాల వివరాలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో డీసీఎస్ఓ వనజాత రెడ్డి, డీటీ సివిల్ సప్లైస్ వై. రామకృష్ణ, శంషాబాద్ డీటీ వాణి రెడ్డి పాల్గొన్నారు. దుకాణాల్లో బియ్యం నిల్వలకు సంబంధించి నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలను అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బియ్యం నిల్వలు, విక్రయాలు చేపడితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అక్రమ నిల్వలు, బియ్యం దుర్వినియోగంపై నిరంతర నిఘా కొనసాగిస్తామని తెలిపారు.

సంప్రదాయ హోలిస్టిక్ వెల్నెస్ లో జాతీయ స్థాయి 'భారతీయ చికిత్సా గౌరవ్ సమ్మాన్-2026'

హైదరాబాద్(ప్రశ్న న్యూస్)ఆరోగ్య సంరక్షణ, సంపూర్ణ ఆరోగ్య విధానాలు (హోలిస్టిక్ వెల్నెస్) రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఏ. సంజయ్ రెడ్డికి జాతీయ స్థాయి గౌరవ పురస్కారం లభించింది. మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్, నితి అయోగ్ సంస్థ జివ్రాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే ప్రతిష్ఠాత్మక 'భారతీయ చికిత్సా గౌరవ్ సమ్మాన్--2026' కు ఆయన ఎంపికయ్యారు.ఆరోగ్య సంరక్షణ నిపుణుడిగా, అంతర్జాతీయ హోలిస్టిక్ వెల్నెస్ ప్రాక్టీషనర్‌గా ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ ప్రత్యేక జాతీయ గౌరవానికి ఎంపిక చేసినట్లు ప్రకటించారు.మర్మ చికిత్స, ఆక్యుప్రెషర్, రిఫ్లెక్సాలజీ, అరోమా థెరపీ, యోగా థెరపీ వంటి సంప్రదాయ, సహజ ఆరోగ్య విధానాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ఆరోగ్య సంరక్షణ రంగంలో సేవలందించడం ఆయన కృషిలో ప్రధాన అంశాలు. హైదరాబాద్ లో జరిగిన జాతీయ హోలిస్టిక్ వెల్నెస్ కాన్ఫరెన్స్ ఆక్యుఉత్సవ్ 2026 లో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ చైర్మన్ చేతుల మీదుగా అడ్వాన్స్డ్ రిఫ్లెక్సలజి సర్టిఫికెట్ ను అందుకున్నారు. అంతర్జాతీయ హోలిస్టిక్ వెల్నెస్ రంగంలో తన సేవలను విస్తరిస్తూ, సంప్రదాయ చికిత్సా విధానాలు, యోగా ఆధారిత ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తున్న సంజయ్ రెడ్డికి ఈ జాతీయ గౌరవం లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ పురస్కారం ఆయన ఆరోగ్య సేవా ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

కార్మిక హక్కుల పరిరక్షణనే ధ్యేయంగా ఉద్యమించాలి- వేణుకుమార్

ఈఎస్ఐ ఆస్పత్రిలో ఘనంగా ఏఐటీయూసీ

107 వ ఆవిర్భావ దినోత్సవం

నాచారం (ప్రశ్న న్యూస్) కార్మికుల హక్కులకు విఘాతం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు వి. వేణుకుమార్ డిమాండ్ చేశారు. ఏఐటియూసీ 107 వ ఆవిర్భావ దినోత్సవాన్ని

పురస్కరించుకొని నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ గ్రేస్ కార్బెట్ జండా ఊపి ప్రారంభించారు. అనంతరం వి. వేణుకుమార్ మాట్లాడుతు ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించుటలో ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, రెండు ప్రభుత్వాలు ఒకేదారిలో పయనిస్తు కార్మికుల హక్కులను హరించి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా కనీస వేతనం రూ. 26,000 కు పెంచాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులందరికి ఉద్యోగ భద్రత కల్పించి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, గుర్తింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ఆటో, హమాలీ అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జి. విక్టోరియా, ఆఫీస్ బేరర్లు అరుణ, భాగ్య, అంజనీ, శ్రీలత, రమేష్, కృష్ణ, సంతోష్, కుమార్, నర్సింగరావు, క్రాంతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం..

మార్కెట్‌లో రైతులకు అపార నష్టం

యాదాద్రి భువనగిరి చౌటుప్పల్‌లో శుక్రవారం రాత్రి అకాల వర్షం కురిసింది. దాంతో అక్కడి వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతోనే నష్టం జరిగిందని రైతుల ఆవేదన. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేసారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేసారు.

సురేఖ సారీల వెనుక కథేంటీ

హైదరాబాద్ : తెలంగాణ మంత్రిగా కొండా సురేఖకు గతంలో దక్కిన గౌరవం.. పరపతి.. రేవంత్ వద్ద బీసీ మహిళా మంత్రిగా కీర్తి అన్నీ ఇన్నీ కావు. అయితే ఒక్క తప్పు.. అదీ ఆమె చేసింది కాదు.. అయినా ఆమె పదవికి ముప్పుతెచ్చింది. కూతురు తప్పును సరిదిద్దక.. వెనకేసుకు రావడం మంత్రి సురేఖ పదవికి ఎసరు తెచ్చింది.. తెలంగాణలో ఆమె మాట్లాడితే ప్రత్యర్థులందరూ వణకాల్సిందే. అంతలా వాగ్ధాటి ఆమె సొంతం. అయితే ముందునుంచి ఆ మాటల మంత్రమే ఆమెను తెలంగాణలో ఒక ఫైర్ నేతగా మార్చింది. రాజకీయ నేతగా నిలబెట్టింది. నాడు వైఎస్ఆర్ కు అండగా కాంగ్రెస్ లో వెలిగిన ఆమె.. అనంతరం ఆమె కుమారుడు జగన్ కు అండగా నిలిచి తెలంగాణలో తీవ్ర వ్యతిరేకత తెచ్చుకున్నారు. అన్న మాట కోసం జగన్ వెంట నడిచి రాళ్లు వేయించుకున్నా వెనక్కి తగ్గలేదు. ఇక రాష్ట్రం విడిపోయాక బీఆర్ఎస్ లో ఫైర్ బ్రాండ్ గా మారి.. అదే దుందుడుకు తనంతో బయటకెళ్లిపోయారు. కాంగ్రెస్ లో చేరి మంత్రి పదవి సంపాదించి ఇక్కడ కూడా అదే స్వభావంతో కష్టాలు కొని తెచ్చుకున్నారు. ఈసారి ఆమె పదవికి చేటు తెచ్చింది మాత్రం ఆమె కూతురు వల్ల.. సీఎం రేవంత్ పై ఆమె కూతురు చేసిన తీవ్ర వ్యాఖ్యలు.. అధిష్టానం ఆగ్రహానికి గురై చివరకు సురేఖ మంత్రి పదవి పోయేలా చేశాయి. అధికారంలో మంత్రిగా ఉన్నప్పుడు సురేఖ గతంలో హీరో నాగార్జునపై, అక్కినేని కుటుంబంపై 'సమంత–నాగచైతన్య' విడాకుల విషయంలో చేసిన కామెంట్స్ దుమారం రేపాయి.

సూర్యాపేట జిల్లాలో విషాదం..

- పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

సూర్యాపేట జిల్లాలో విషాదం నెలకొంది. పిడుగుపాటుకు ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనతో పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన ధూబని నాగరాజు (32) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని రాయి చెరువు సమీపంలో రాత్రి గొర్రెల మందకు కాపలాగా నాగరాజు పడుకున్నాడు. ఈ క్రమంలో రాత్రి పిడుగుపడటంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ఉదయం అటువైపుగా వెళ్లిన స్థానికులు ఈ విషయాన్ని గుర్తించారు. ఈ విషయం తెలిసి నాగరాజు కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు తీవ్రగ్భ్రాంతికి గురయ్యారు. చిన్న వయసులోనే కుటుంబానికి ఆధారంగా ఉన్న నాగరాజు మృతితో మాచారం గ్రామంలో విషాదం నెలకొంది.

వట్టినాగులపల్లిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి..

- 27 మంది అరెస్ట్!

శేరిలింగంపల్లి, అక్టోబర్ 31: హైదరాబాద్ శివారులోని వట్టినాగులపల్లిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గచ్చిబౌలి పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 27 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ది స్కై బై విహారా ఫామ్‌లో అందర్ బహార్ పేకాట నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఈ దాడి చేపట్టారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో 27 మంది పట్టుబడ్డారు. ప్రాథమిక విచారణలో చిన్న యాదవ్ (బీఎన్ రెడ్డి నగర్), సోను (సన్‌సిటీ), నవీన్ అనే వ్యక్తులు గత నాలుగు నెలలుగా ఈ పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడైనట్లు సమాచారం. ఈ స్థావరంలో ప్రతిరోజూ సుమారు రూ.20 లక్షల మేర పేకాట లావాదేవీలు జరుగుతున్నట్లు తెలిసింది. దాడిలో రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఘటనపై మరింత విచారణ చేపట్టారు. పేకాట నిర్వహణకు సంబంధించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

2,202 మంది పోలీసులతో భారీ బందోబస్తు

- తిరుపతి ఎస్పీ - నవంబర్ 1న ఎన్నికలు:

తిరుపతి జిల్లాలో నవంబర్ 1న జరగనున్న ఐదు మున్సిపాలిటీల ఎన్నికలకు 2,202 మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. ఓటర్లకు విజ్ఞప్తి: ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. భద్రతా సిబ్బంది వివరాలు: తిరుపతి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి మున్సిపాలిటీల పరిధిలో 8 మంది డిఎస్పీలులు, 26 మంది సిఐలు, 98 మంది ఎస్సైలతో పాటు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలను మోహరించినట్లు వెల్లడించారు

పార్వతీపురం మన్యంలో ఏనుగుల బీభత్సం

- పొలాలకు వెళ్లాలంటేనే రైతులకు ప్రాణభయం..

- గతంలో గ్రామంలో ఒకరు మృతి

పార్వతీపురం మన్యం పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామ సమీపంలో శనివారం (అక్టోబర్ 31, 2026) ఏనుగులు సంచరించడంతో స్థానిక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ, ఏనుగుల సంచారంతో ప్రాణభయం వెంటాడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏనుగుల దాడిలో తమ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయారని గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల దాడుల ఘటనలు తమను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయని చెబుతున్నారు. పంట పనులు వదులుకోలేక పొలాలకు వెళ్లాల్సి వస్తోందని, ఏ సమయంలో ఏనుగులు ఎదురవుతాయోనన్న ఆందోళనతో రైతులు బిక్కుబిక్కుమంటూ వ్యవసాయ పనులు చేస్తున్నారని తెలిపారు.ఈ సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని పెదబొండపల్లి రైతులు కోరుతున్నారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, గ్రామస్తులు మరియు రైతులకు ముందస్తు హెచ్చరికలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రైతుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.. ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి అని పెదబొండపల్లి గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ఘనంగా 2ఐ రన్

వికారాబాద్ భారతదేశ ఐక్యత, సమగ్రత, సమైక్యతకు ప్రతీకగా నిలిచిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని, జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా శనివారం వికారాబాద్ పట్టణంలో 2ఐ రన్ నిర్వహించారు.యెన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ రన్‌లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, , అదనపు ఎస్పీశ్రీ రాజేష్ మీనా, వికారాబాద్ డీఎస్పీ రీ అంజయ్య, ఏఆర్ డీఎస్పీ రీ వీరేష్ వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్రు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువకులు, యువతులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలోని సంస్థానాలను ఏకం చేసి భారతదేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా జాతీయ భావనతో ముందుకు సాగాలని, యువత దేశాభివృద్ధిలో భాగస్వాములై ఐక్యతతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, మాట్లాడుతూ, జాతీయ ఐక్యతా దినోత్సవం దేశ సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరికీ గుర్తుచేస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ దేశాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ 2ఐ రన్ ద్వారా దేశ ఐక్యత, సోదరభావం, జాతీయ సమైక్యత ప్రాముఖ్యతను ప్రజలకు చాటిచెప్పారు. దేశ ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

బడిలోనే బీభత్సం..

బాలికపై రంపంతో కిరాతక దాడి

- చదువుల గుడిలో రక్తపాతం.. పదో తరగతి విద్యార్థినిపై విచక్షణారహితంగా దాడి
- చిన్నారి ప్రాణాలతో పోరాటం.. అడ్డుకున్న మరో బాలికకూ గాయాలు
- తరగతి గదిలోకి దుండగుడు ఎలా వచ్చాడు.?పాఠశాల భద్రత ఏమైంది
- ఘటనపై సీఎం చంద్రబాబు ఆగ్రహం.. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని ఆదేశం
- ఆడపిల్లల జోలికొస్తే వణికిపోయేలా చర్యలు: నారా లోకేశ్
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి: పవన్ కల్యాణ్

అనంతపురం (ప్రశ్న న్యూస్) అక్షరాలు నేర్చుకోవాల్సిన తరగతి గది రక్తంతో తడిసిపోయింది. ఆటపాటలతో సందడిగా ఉండాల్సిన పాఠశాల ప్రాంగణం భయాందోళనలతో దద్దరిల్లింది. బడికి వెళ్లిన చిన్నారికి చదువుల బదులు ప్రాణభయం ఎదురైంది. అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో చోటుచేసుకున్న ఈ అమానుష ఘటన సభ్యసమాజాన్ని కలచివేసింది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ వ్యక్తి రంపంతో విచక్షణారహితంగా దాడి చేయడం తీవ్ర సంచలనం సృష్టించింది.

రంపంతో విరుచుకుపడి.. రక్తపాతం

పాఠశాలలో ఉన్న విద్యార్థినిపై దాడికి పాల్పడిన వ్యక్తి రంపంతో ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్రంగా గాయపరిచినట్లు సమాచారం. ఒక్కసారిగా జరిగిన ఈ దాడితో పాఠశాలలో భీతావహ వాతావరణం నెలకొంది. తోటి విద్యార్థులు భయంతో పరుగులు తీయగా, దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికను ఆస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అత్యవసర చికిత్సతోపాటు శస్త్రచికిత్స చేపట్టారు.

బడిలోకి దుండగుడు ఎలా వచ్చాడు

ఈ ఘటన ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. విద్యార్థినులు చదువుకుంటున్న పాఠశాలలోకి రంపంతో ఓ వ్యక్తి ప్రవేశించే పరిస్థితి ఎలా ఏర్పడింది.? పాఠశాల ప్రవేశ ద్వారాల వద్ద భద్రతా పర్యవేక్షణ లేదా.? బయట వ్యక్తుల రాకపోకలను గుర్తించే వ్యవస్థ ఉందా.? విద్యార్థుల రక్షణకు బాధ్యత వహించాల్సిన యంత్రాంగం ఏం చేస్తోంది.? పాఠశాలలు కూడా సురక్షితం కాకపోతే ఆడపిల్లల తల్లిదండ్రులు ఎవరిని నమ్మాలి.? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

సీఎం చంద్రబాబు ఆరా.. కఠిన చర్యలకు ఆదేశం

రాప్తాడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వైద్య సేవలపై వివరాలు సేకరించారు. నిందితుడిని గుర్తించి అరెస్టు చేయాలని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఆడపిల్లల జోలికొస్తే ఉపేక్షించేది లేదు: లోకేశ్

మంత్రి నారా లోకేశ్ ఘటనపై తీవ్రంగా స్పందించారు. తరగతి గదిలో రక్తమోడుతున్న చిన్నారిని చూసిన తర్వాత కన్నీళ్లు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై దాడులకు పాల్పడే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. పిల్లల భద్రతకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బాధితులకు అండగా ప్రభుత్వం: పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అనంతపురం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాలికతోపాటు మరో విద్యార్థినికి కూడా మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసు శాఖకు దిశానిర్దేశం చేశారు.

ఆస్పత్రికి చేరుకున్న పరిటాల సునీత

బాధిత బాలికకు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆస్పత్రికి చేరుకున్నారు.

వైద్యులతో మాట్లాడి బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడించారు. కుటుంబానికి సీఎం ధైర్యం చెప్పారు.

మహిళా కమిషన్ పర్యవేక్షణ

ఘటనను ఏపీ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ బాధిత విద్యార్థినితోపాటు దాడిని అడ్డుకునే క్రమంలో గాయపడిన మరో బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఇద్దరికీ అందుతున్న వైద్య సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

దోషిని వదిలే ప్రసక్తే లేదు

- రాప్తాడు బాలికపై దాడితో పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి
- చిన్నారి ప్రాణాలకు భరోసా కల్పించండి..
- వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి
- గాయపడిన మరో విద్యార్థినికీ మెరుగైన చికిత్స అందించాలి
- నిందితుడి అరెస్టులో జాప్యం వద్దు..చట్టప్రకారం కఠిన శిక్ష పడాలి

అమరావతి(ప్రశ్న న్యూస్) అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దారుణ దాడి ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థిని చదువుకుంటున్న తరగతి గదిలోకి చొరబడి దాడికి పాల్పడటం అమానుషమని, ఇలాంటి ఘటనలకు సమాజంలో ఏమాత్రం చోటు లేదని స్పష్టం చేశారు.

వైద్యంలో నిర్లక్ష్యం వద్దు..

దాడి ఘటనపై అనంతపురం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన పవన్ కల్యాణ్ పూర్తి వివరాలను తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా తీశారు. బాలికకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. దాడిని అడ్డుకునే క్రమంలో గాయపడిన మరో విద్యార్థినికి కూడా మెరుగైన చికిత్స అందించాలని స్పష్టం చేశారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

నిందితుడిపై ఉక్కుపాదం..

పాఠశాల ప్రాంగణంలోకి చొరబడి బాలికపై దాడికి పాల్పడిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని పోలీసు శాఖకు దిశానిర్దేశం చేశారు. చట్ట ప్రకారం కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదని, ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

బాధిత కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం..

ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించడంతోపాటు కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సూచించారు.

జర్నలిస్ట్ నిధి రజ్దాన్‌ను పెళ్లాడిన సీఎం ఒమర్ అబ్దుల్లా

- ప్రత్యేక వివాహ చట్టంతో ఒక్కటైన జంట!



శ్రీనగర్ (ప్రశ్న న్యూస్) జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 56 ఏళ్ల వయసులో ప్రముఖ జర్నలిస్ట్ నిధి రజ్‌దాన్‌ను వివాహం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. నిధితో కలిసి దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. "నిన్నటి నుంచి కొత్త ప్రయాణం ప్రారంభమైంది" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌లో నిధిని ట్యాగ్ చేశారు. పెళ్లి జరిగిన మరుసటి రోజు ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. ఒమర్ అబ్దుల్లా వ్యక్తిగత జీవితంలో కీలక పరిణామం చోటుచేసుకున్న మూడు నెలలకే ఈ వివాహం జరిగింది. ఆయనకు, విడిపోయి ఉంటున్న భార్య పాయల్ అబ్దుల్లాకు విడాకులు మంజూరు చేసేందుకు జులై 31న సుప్రీంకోర్టు అంగీకరించింది.

ఇద్దరూ పరస్పర అంగీకారంతో వివాహ బంధాన్ని ముగించుకోవాలని నిర్ణయించుకున్నట్లు కోర్టుకు తెలిపారు. తమ మధ్య ఉన్న వివాదాలను పరిష్కరించుకోవడంతో పాటు, ఒకరిపై మరొకరు దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకోవడానికి అంగీకరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద విడాకులు మంజూరు చేయాలని ఉమ్మడిగా కోరారు. ఒమర్ అబ్దుల్లా, పాయల్ 1994లో వివాహం చేసుకున్నారు. వీరికి జహీర్, జమీర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. 2009 నుంచి ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. 2011లో ఒమర్ ఈ విషయాన్ని ప్రకటించారు. తాజాగా నిధి రజ్‌దాన్‌ను వివాహం చేసుకున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్ అపరిశుభ్రత హోటల్స్

- 14 హోటళ్ల లైసెన్సులు సస్పెండ్- తక్షణమే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బిర్యానీకి, రుచికరమైన వంటకాలకు పేరుగాంచిన హైదరాబాద్‌లోని పలు ప్రముఖ హోటళ్లలో ఆహార భద్రత అధికారుల తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. పేరున్న హోటళ్లలోనే అపరిశుభ్ర వంటశాలలు, బూజుపట్టిన ఆహార పదార్థాలు, బొద్దింకలు, ఎలుకల వ్యర్థాలు దర్శనమివ్వడం కలకలం రేపుతోంది.తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) ఆధ్వర్యంలో శనివారం గోల్కొండ, చార్మినార్ జోన్ల పరిధిలో 22 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. మొత్తం 22 హోటళ్లు, రెస్టారెంట్లలో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించాయి.తనిఖీల్లో బయటపడిన విస్తుపోయే అంశాలు. అపరిశుభ్రంగా, దుర్వాసనతో కూడిన వంటశాలలు. కుళ్లిపోయిన కూరగాయలు, బూజుపట్టిన ఆహార పదార్థాలు.ఫ్రిజ్‌లలో పచ్చి మాంసం, వండిన ఆహార పదార్థాలను కలిపి నిల్వ చేయడం. పదేపదే వాడిన వంట నూనెతో వంటకాలు తయారు చేయడం. వంటశాలల్లో బొద్దింకలు, ఈగలు, ఎలుకల సంచారం. గడువు ముగిసిన ఆహార పదార్థాల వినియోగం. ఆహార పదార్థాలపై పాత వార్తాపత్రికలు కప్పడం. సిబ్బంది చేతులకు గ్లౌజులు, తలకు హెయిర్ నెట్స్ లేకుండానే ఆహార తయారీ.

అధికారుల కొరడా.. భారీగా ఆహార పదార్థాల ధ్వంసం

తనిఖీల్లో అనుమానం వచ్చిన 21 ఆహార నమూనాలను అధికారులు సేకరించారు. మరోవైపు 544 కిలోల కుళ్లిపోయిన కూరగాయలు, కలుషిత ఆహార పదార్థాలు, మిగిలిపోయిన వంటకాలు, గడువు ముగిసిన సరుకులను అక్కడికక్కడే పారవేశారు. పదేపదే వినియోగిస్తున్నారనే అనుమానంతో 13 కిలోల వాడిన వంట నూనెను కూడా తొలగించారు.

8 హోటళ్లకు షోకాజ్ నోటీసులు..

తీవ్రమైన ఉల్లంఘనలు గుర్తించిన 8 సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీటిపై తదుపరి చర్యలు తీసుకుని జరిమానాలు విధించనున్నారు.

14 హోటళ్ల లైసెన్సులు సస్పెండ్..

మరో కీలక నిర్ణయంగా 14 హోటళ్లు, రెస్టారెంట్ల ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ లైసెన్సులను అధికారులు సస్పెండ్ చేశారు. తక్షణమే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు.

లైసెన్సులు సస్పెండ్ అయిన సంస్థలు..

- హోటల్ శ్రీ రాఘవేంద్ర ఉడిపి వెజ్ - టోలిచౌకి
- లక్కీ రెస్టారెంట్ - సంతోష్‌నగర్
- షా ఘౌస్ కేఫ్ - షాలిబండ
- హోటల్ నయాబ్ - చార్మినార్
- శ్రీ బాలాజీ ఫ్యామిలీ ధాబా - గుడిమల్కాపూర్
- సిద్ధిక్ కబాబ్ సెంట్రల్ కిచెన్ - గుడిమల్కాపూర్
- అల్‌సబా హోటల్ - టోలిచౌకి
- మెహఫిల్ రెస్టారెంట్ - దిల్‌సుఖ్‌నగర్
- హోటల్ శ్రీ రాఘవేంద్ర ఉడిపి వెజ్ - సంతోష్‌నగర్
- డైన్ హిల్ రెస్టారెంట్ - మాసబ్‌ట్యాంక్
- సోహైల్ రెస్టారెంట్ - మలక్‌పేట
- హోటల్ అక్షయ టిఫిన్స్ - మలక్‌పేట
- హోటల్ వెంకటేశ్వర - ఎంజేఆర్ రోడ్
- అజీబో ది రాయల్ అరేబియన్ రెస్టారెంట్ - రెతిబౌలి

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని అధికారుల చర్యలు స్పష్టం చేస్తున్నాయి.
హైదరాబాద్‌లో పేరున్న హోటళ్లలోనే ఈ స్థాయిలో అపరిశుభ్రత బయటపడటం నగరవాసులను ఆందోళనకు గురిచేస్తోంది. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని హోటళ్లపై మరిన్ని తనిఖీలు కొనసాగుతాయా.? అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588